

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 150 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 7 అక్టోబర్ 2025 | వెల : 4/-

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326





## నవంబర్ 6 నుంచి బిహార్‌లో ఎన్నికలు

- రెండు విడతల్లో పోలింగ్
- బిహార్‌లో మొత్తం 243 శాసనసభ స్థానాలు
- ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది.
- నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్
- నవంబర్ 14న ఓట్ల లెక్కింపు




## నేవీ అమ్ములపొదిలో మరో అస్త్రం

- సాగర జలాల్లోకి యుద్ధ నౌక 'ఆంద్రోత్'
- 'యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్' 'ఆంద్రోత్' జలప్రవేశం
- భారత నౌకాదళం స్వదేశీకరణ ప్రయత్నాల్లో ఇది మరో మైలురాయిగా నిలిచింది

# కనిపించని జోష్

## రేసులో వెనుకబడ్డ కాంగీ
## కమలంలో కనిపించని జోష్

- స్థానిక ఎన్నికలు జరుగుతాయా.. లేదా.. ?
- ఖర్చుపై ఆశావహుల డైలమా
- అత్యధిక చోట్ల దసరా దావత్‌లకూ దూరమే
- కొన్నిచోట్ల కోర్టు తీర్పు తర్వాత ఇస్తామని హామీ
- ఏం జరుగుతుందో తెలియక ఆచితూచి అడుగులు
- షెడ్యూలు వచ్చినా కనిపించని 'లోకల్ జోష్'
- మరోవైపు.. సిద్ధమవుతున్న అభ్యర్థుల జాబితాలు
- ఏకగ్రీవం చేసుకునేందుకు కొన్నిచోట్ల యత్నాలు
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అంతే..
- జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది



హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ వచ్చిందంటే చాలు.. గ్రామాల్లో ఆ జోషే వేరు! అప్పటి వరకూ ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతుంది. ప్రజలు కూడా పార్టీల వారీగా గ్రూపులు కడతారు! ఖర్చు విషయంలో ఆశావహులు తగ్గేదే లేదన్నట్టు పెడుతుంటారు. షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఎన్నికల తంతు పూర్తయ్యే వరకు అస్సలు వెనుకాడరు. కానీ, ఈసారి పరిస్థితులు ఇందుకు కొంత భిన్నంగా ఉన్నాయి. ఆశావహులు.. తమకే టికెట్ వస్తుందని అనుకుంటున్నవారు.. అభ్యర్థి తానేనని కొంతవరకూ ఖరారైన వారిలోనూ ఒక రకమైన డైలమా కనబడుతోంది. ఖర్చు విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. నిజానికి, షెడ్యూల్ విడుదలైన తర్వాత దసరా రావడంతో - మిగతా 3లో



## సర్కార్‌కు ఊరట


- తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-9 అమలుపై స్టే ఇవ్వాలని పిటిషన్‌లో గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి
- వంగ గోపాల్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంలో గోపాల్ రెడ్డి పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరణ



## కర్ణాటక గుహలో మగ్గిన చిన్నారులు

- తండ్రినని చెప్పుకున్న వ్యక్తిపై సుప్రీం కోర్టు ఆగ్రహం
- కర్ణాటక గుహలో పోలీసులకు చిక్కిన రష్యన్ మహిళ
- నీనా కుటీనా అనే రష్యా మహిళ తన ఇద్దరు పిల్లలతో గోకర్ణలోని రామతీర్థ గుహల్లో రహస్యంగా జీవిస్తూ జులై 11న పోలీసులకు చిక్కింది

## బీహార్ ఎన్నికల్లో 'ఆప్'



తొలి జాబితా ప్రకటించిన కేజ్రీవాల్

11 మంది అభ్యర్థుల తొలి జాబితాను విడుదల

## సుప్రీంకోర్టు తీర్పు శుభపరిణామం

- 'సుప్రీంకోర్టు తీర్పు శుభ పరిణామం
- 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును కోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం.
- కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తాం
- ఇప్పటికే ప్రభుత్వం మూడు చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది



హైదరాబాద్

బీసీ రిజర్వేషన్ల విషయంలో సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట దక్కింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు స్పందిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు శుభపరిణామం అంటూ కామెంట్స్ చేస్తున్నారు. హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 'సుప్రీంకోర్టు తీర్పు శుభ పరిణామం. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును - మిగతా 3లో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో 100 శాతం బీసీకే సీటు

- తెలంగాణలో కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ గెలిచారు
- జూబ్లీహిల్స్ అభివృద్ధికి పదేళ్లుగా దూరమైంది
- ఆర్ఎస్ పార్టీ నాయకులు సానుభూతి పేరిట మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబాన్ని రోడ్డు మీద పడేసి రాజకీయం చేస్తున్నారు.
- ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను ఆమోదింపచేయాలి
- భాజపా ఫ్యూడలిస్టు పార్టీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం



ఢిల్లీ

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో 100 శాతం బీసీకే సీటు వస్తుందనే నమ్మకం తనకు ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే పర్యటన చేస్తున్నట్లు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గణేష్ గెలిచారని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ప్రజలు విజ్ఞతతో ఓటు వేస్తారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుస్తుందని పొన్నం ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధికి పదేళ్లుగా దూరమైందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సానుభూతి - మిగతా 3లో



## వరదలకు మానవ నిర్మిత విపత్తే కారణం

- పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ
- దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఎటువంటి సమన్వయం లేకుండా రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయడమే ఈ పరిస్థితికి కారణమని
- డబ్బుతో ప్రాణ నష్టాన్ని పూడ్చలేం
- అయితే ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుంది

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల

- నవంబర్ 11 వ తేదీన ఉప ఎన్నిక
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈ నెల 13వ తేదీన ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల
- ఆ రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- వచ్చే నెల 11వ తేదీన ఉప ఎన్నిక.. 14వ తేదీన కౌంటింగ్



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. బిహార్ అసెంబ్లీతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నికకు సంబంధించి పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఈ షెడ్యూల్ ప్రకారం.. నవంబర్ 11 వ తేదీన ఉప ఎన్నిక జరగనుంది. తాజా షెడ్యూల్ ప్రకారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈ నెల 13వ తేదీన ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఆ రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 21వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 22న నామినేషన్లను స్క్రుటినీ చేస్తారు. వచ్చే నెల 11వ తేదీన ఉప ఎన్నిక నిర్వహిస్తారు. 14వ తేదీన కౌంటింగ్ చేసి, ఫలితాలు విడుదల చేస్తారు. 2023లో జరిగిన - మిగతా 3లో

# నవంబర్ 6 నుంచి బిహార్‌లో ఎన్నికలు




**ఢిల్లీ:** బిహార్ శాసనసభ ఎన్నికలకు నగారా మోగింది కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ఈ మేరకు షెడ్యూల్ ఖరారు చేసింది. పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 6, నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. బిహార్‌లో మొత్తం 243 శాసనసభ స్థానాలున్నాయి. ప్రస్తుత అసెంబ్లీ గడువు వచ్చే నెల చివరి వారంతో ముగియనుంది. ప్రస్తుతం బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉంది. 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం లభించలేదు. దీంతో జేడీయూ, భాజపా కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ, రెండేళ్లకే నీతీశ్ ఎన్డీయేను వీడి.. ఆర్జేడీ, కాంగ్రెస్‌తో మహాగఠ్‌బంధన్‌లో చేరి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే, ఈ బంధమూ ఎంతోకాలం నిలవలేదు. 2024 జనవరిలో మహా కూటమిని వీడిన జేడీయూ మళ్లీ ఎన్డీయేతో కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో మరోసారి నీతీశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు.

**ఎస్ఐఆర్‌పై అభ్యంతరాలు ఉంటే..**

బిహార్‌లో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై జ్ఞానేశ్ కుమార్ స్పందించారు "ఎస్ఐఆర్ ముసాయిదాను ఆగస్టు ఒకటిన విడుదల చేశాం. దానిని అన్ని రాజకీయ పార్టీలకు అందజేశాం. అభ్యంతరాలు ఉంటే వ్యక్తం చేసే అవకాశం ఇచ్చాం. తుది జాబితాను సెప్టెంబర్ 30న ప్రకటించాం. ఇప్పటికీ అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తాం" అని తెలిపారు.

ఈ ఎన్నికలను ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని జ్ఞానేశ్ చెప్పారు. 90 వేల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. 7.43 కోట్ల మంది ఓటు వేయనున్నారని, వారిలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.50 కోట్ల మహిళా ఓటర్లు ఉన్నారని చెప్పారు. రద్దీ నిర్వహణ కోసం ఒక్కో బూత్‌లో 1200 మంది ఓటు వేసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈవీఎంలపై తొలిసారి అభ్యర్థుల కలర్ ఫొటోలు వేసే ప్రక్రియను ఈ ఎన్నికలతోనే ప్రారంభిస్తున్నామని తెలిపారు.

**8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు..**

ఏడు రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లోని 8 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉప ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్‌లోని అంతా, ఝూర?ండ్‌లోని ఘట్‌శిలా, తెలంగాణలోని జూబ్లీహిల్స్, పంజాబ్‌లోని తర్న్‌తారన్, మిజోరంలోని దంపా, ఒడిశాలోని నౌపాడాతోపాటు జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని బద్గామ్, నగ్రోటా స్థానాలకు ఉప ఎన్నికలు జరుగుతాయని ఈసీ వెల్లడించింది.

# కర్ణాటక గుహలో మగ్గిన చిన్నారులు



**ఇంటర్నెట్ డెస్క్:** కర్ణాటకలోని ఓ గుహలో పోలీసులకు చిక్కిన రష్యన్ మహిళ, ఆమె పిల్లలను స్వదేశానికి తరలించొద్దంటూ చిన్నారుల తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. చిన్నారులు, తమ తల్లితో గుహలో తలదాచుకుంటుంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. మిమ్మల్ని కూడా ఎందుకు దేశం నుంచి పంపించకూడదో చెప్పాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌కు వెనక్కు తీసుకోవాలని తేల్చి చెప్పింది నీనా కుటీనా అనే రష్యా మహిళ తన ఇద్దరు పిల్లలతో గోకర్ణలోని రామతీర్థ గుహల్లో రహస్యంగా జీవిస్తూ జులై 11న పోలీసులకు చిక్కింది. రెండు నెలలుగా ఆమె గుహలోనే తలదాచుకుంటోందని పోలీసులు తెలిపారు. వారి వద్ద సరైన పత్రాలు ఏవీ లేవని అన్నారు. ప్రస్తుతం వారు పోలీసుల సంరక్షణలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రష్యా కాన్సులేట్ వారికి ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్స్‌ను కూడా జారీ చేసింది. ఈ క్రమంలోనే ఇజ్రాయెలీ జాతీయుడు డ్రోర్ ష్లోమో గోల్డ్‌స్టీన్ అనే వ్యక్తి ఈ కేసుకు సంబంధించి కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తాను ఆ చిన్నారుల తండ్రినని తెలిపాడు. బిడ్డలను రష్యాకు తరలించకుండా కేంద్రానికి మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టును అభ్యర్థించారు. ఏడాది క్రితమే ఆయన తన బిడ్డలు కనిపించట్లేదంటూ గోవాలోని పానాజీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, ఈ పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు కొట్టివేసింది. రష్యన్ మహిళ, ఆమె పిల్లలను కేంద్ర ప్రభుత్వం స్వదేశానికి తరలించొచ్చని తెలిపింది. ఇంతకాలం వారు గుహలో ఎందుకున్నారనే ప్రశ్నకు గోల్డ్‌స్టీన్ సంతృప్తికర సమాధానం ఇవ్వలేకపోయారని పేర్కొంది. తాను రష్యాకు వీలైనంత త్వరగా వెళ్లిపోయేందుకు నీనా కూడా సంసిద్ధత వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ గోల్డ్‌స్టీన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా కోర్టు మళ్లీ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'అసలు ఇలా కోరేందుకు మీకున్న హక్కు ఏమిటి? మీరు ఎవరు? మీరు ఆ బిడ్డలకు తండ్రి అనేందుకు అధికారిక డాక్యుమెంట్ ఉంటే చూపించండి. అసలు మిమ్మల్ని దేశం విడిచి వెళ్లాలని మేమెందుకు ఆదేశించవద్దో ముందు చెప్పండి' అని న్యాయస్థానం ఆగ్రహించింది. పిల్లలు గుహలో ఉంటే మీరు గోవాలో ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. 'ఎవరు పడితే వారు ఇక్కడికి వచ్చి ఉండిపోతున్నారు. ఇలాంటి వారికి భారత్ స్వర్గ ధామంగా మారిపోయింది' అని కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషన్‌ను ఉపసంహరించుకోమని గోల్డ్‌స్టీన్‌కు స్పష్టం చేసింది.

# వరదలకు మానవ నిర్మిత విపత్తే కారణం



విలేకరులతో మాట్లాడిన మమతా బెనర్జీ డీవీసీపై పలు ఆరోపణలు చేశారు.

**కోల్‌కతా:** రాష్ట్రంలో సంభవించిన వరదలకు, ముఖ్యంగా ఉత్తర బెంగాల్‌లో తలెత్తిన దుర్భర పరిస్థితులకు దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (వీడీవీసీ) కారణమంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వరదలను ఆమె మానవ నిర్మిత విపత్తుగా అభివర్ణించారు. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ ఎటువంటి సమన్వయం లేకుండా రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయడమే ఈ పరిస్థితికి కారణమని మమతా ఆరోపించారు. శనివారం నుంచి నమోదవుతున్న రికార్డు స్థాయి వర్షపాతం కారణంగా ఇప్పటికే దెబ్బతిన్న డార్జిలింగ్, చుట్టుపక్కల ప్రాంతాలలో డీవీసీ చేపట్టిన చర్యలు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదలు, కొండచరియలు విరిగిపడిన కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి రూ. ఐదు లక్షల పరిహారం, ఒకరికి హోమ్‌గార్డ్ ఉద్యోగం ప్రకటించారు. డబ్బుతో ప్రాణ నష్టాన్ని పూడ్చలేమని, అయితే ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని ఆమె తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు బాగ్డోగ్రాకు బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడిన మమతా బెనర్జీ డీవీసీపై పలు ఆరోపణలు చేశారు. జార?ండ్‌ను వరదల నుంచి రక్షించేందుకు డీవీసీ మైథాన్,పాంచెట్ రిజర్వాయర్ల నుంచి ఇష్టం వచ్చినట్లుగా నీటిని విడుదల చేసిందని, ఇది దిగువ ప్రాంతమైన బెంగాల్‌లో పరిస్థితిని మరింత దారుణంగా మార్చిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. కేవలం 12 గంటల్లో 300 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని. దీని కారణంగా హైవేలు, వంతెనలు, ఇళ్లు ధ్వంసమయ్యాయన్నారు. కాగా డార్జిలింగ్‌లోని మిరిక్, సుఖియాపోఖ్రి, జోరెబంగ్లో, అలాగే జల్‌పాయ్‌గురి జిల్లాలోని నాగర్‌కట వరద ప్రభావిత ప్రాంతాలలో ఉన్నాయని వార్తా సంస్థ పీటీఐ తెలిపింది. ఇప్పటివరకు ఉత్తర బెంగాల్ వరదలలో 23 మంది మృతి చెందారని మమత తెలిపారు. డార్జిలింగ్, మిరిక్, కాలింపాంగ్‌లలో 18 మంది, నాగర్‌కటలో ఐదుగురు మృతి చెందారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆమె అన్నారు. కాగా వరద ప్రభావిత జిల్లాల్లో చిక్కుకుపోయిన పర్యాటకులను తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వం 45 బస్సులను ఏర్పాటు చేసింది. ఇప్పటికే దాదాపు 500 మంది పర్యాటకులను తరలించామని, మరో 250 మందికి సిలిగురిలో వసతి కల్పిస్తామని సీఎం తెలిపారు. డైమండ్ హార్బర్ నుండి తప్పిపోయిన ఒక వ్యక్తి మినహా మిగిలిన పర్యాటకులందరినీ రక్షించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. చిక్కుకుపోయిన పర్యాటకుల నుంచి డబ్బులు వసూలు చేయవద్దని, గదులు ఖాళీ చేయమని ఒత్తిడి చేయవద్దని హోటళ్లను ప్రభుత్వం ఆదేశించింది. ఆ ఖర్చులను తామే భరిస్తామని ప్రభుత్వం హామీనిచ్చింది.

## శబరిమల 'స్వర్ణ కుంభకోణం': సిట్ దర్యాప్తునకు హైకోర్టు ఆదేశం



**కొచ్చి:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి ఆలయ బంగారు తాపడం పనుల్లో జరిగిన భారీ అక్రమాలపై కేరళ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ఏర్పాటు చేయాలని సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఆలయ ద్వారపాలకుల విగ్రహాల బంగారు తాపడంలో బంగారం బరువు తగ్గడం, ఆభరణాల నిర్వహణలో జరిగిన అక్రమాలపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'స్వర్ణ కుంభకోణం'పై ఏర్పాటైన సిట్‌కు కేరళ పోలీస్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) హెచ్ వెంకటేష్ నేతృత్వం వహిస్తారు. ఈ కుంభకోణంలో అవినీతి పాల్పడింది కేవలం ఉన్నికృష్ణన్ పొట్టి మాత్రమే కాదని, దేవాలయ ఆస్తులను నిర్వహించే దేవస్వం బోర్డు అధికారుల ప్రమేయం కూడా ఉందని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) కింద శిక్షార్హమైన పలు నేరాలు జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని కోర్టు పేర్కొంది. సిట్ ఈ కుంభకోణంపై అత్యంత నిజాయితీతో, గోప్యంగా దర్యాప్తు నిర్వహించాలని, అసలు దోషులను బయటికి తీసుకురావాలని హైకోర్టు ఆదేశించింది. ఈ వివాదానికి బలం చేకూర్చే ఒక కీలక అంశాన్ని హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. 2019 డిసెంబర్ 9న ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడికి పంపిన ఒక ఈ మెయిల్‌ను కోర్టు పరిశీలించింది. శబరిమల గర్భగుడి, ద్వారపాలకుల విగ్రహాల బంగారు పనులు పూర్తయిన తర్వాత తన వద్ద కొంత అదనపు బంగారు పలకలు మిగిలాయని పొట్టి ఆ ఈ మెయిల్‌లో పేర్కొన్నారు. ఆ అదనపు బంగారాన్ని ఒక పేద అమ్మాయి పెళ్లి కోసం వినియోగించడంపై దానిలో అభిప్రాయం కోరారు. ఈ ఈ మెయిల్ చూస్తుంటే పొట్టి వద్ద మిగులు బంగారం ఉన్నట్లు స్పష్టమవుతోందని, అందుకే ఈ అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని కోర్టు పేర్కొంది. ఆలయ పవిత్రతను కాపాడేందుకు దేవాలయ ఆస్తుల నిర్వహణలో పారదర్శకతను తీసుకువచ్చేందుకు సిట్ దర్యాప్తు కీలకంగా మారనుంది.

## బీహార్ ఎన్నికల్లో 'ఆప్'..



**పట్నా:** బీహార్‌లో ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం నాడు బీహార్ ఎన్నికల్లో పోటీచేసే 11 మంది అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. బీహార్ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు 'ఆప్' గత జూలైలో ప్రకటించింది. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆ పార్టీ ఇండియా కూటమిలో భాగమైనప్పటికీ, బీహార్ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. 'ఆప్' సీనియర్ నేత సౌరభ్ భరద్వాజ్ కూడా బీహార్ ఎన్నికల్లో పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని ధృవీకరించారు. బీహార్ ఎన్నికల్లో పోటీచేయబోయే 11 మంది అభ్యర్థుల జాబితా..

డాక్టర్ మీరా సింగ్ – బెగుసరాయ్ (బెగుసరాయ్)
యోగి చౌపాల్ – కుశేశ్వరస్థాన్ (దర్భంగా)
అమిత్ కుమార్ సింగ్ – తారయ్య (సరణ్)
భాను భారతీయ – కస్బా (పూర్ణియ)
శుభదా యాదవ్ – బేనిపట్టి (మధుబని)
అరుణ్ కుమార్ రజక్ – ఫుల్వారీ షరీఫ్ (పట్నా)
డాక్టర్ పంకజ్ కుమార్ – బంకీపూర్ (పట్నా)
అష్రఫ్ ఆలం – కిషన్‌గంజ్ (కిషన్‌గంజ్)
అఖిలేష్ నారాయణ్ ఠాకూర్ – పరిహార్ (సీతామర్హి)
అశోక్ కుమార్ సింగ్ – గోవింద్‌గంజ్ (మోతిహారి)
మాజీ కెప్టెన్ ధరమ్‌రాజ్ సింగ్ – బక్సర్ (బక్సర్)

2020 బీహార్ ఎన్నికల ఫలితాలు ఇలా..


మునుపటి(2020) బీహార్ అసెంబ్లీ ఎన్నికలు మూడు దశల్లో జరిగాయి. మొదటి దశ అక్టోబర్ 28, రెండవ దశ నవంబర్ 3, మూడవ దశ నవంబర్ 7. ఫలితాలు నవంబర్ 10 న ప్రకటించారు. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) వెల్లడించిన వివరాల ప్రకారం, 2020 బీహార్ ఎన్నికల్లో ?మొత్తం పోలింగ్ శాతం 57.05గా ఉంది. మొదటి దశలో 55.68 శాతం, రెండవ దశలో 55.70 శాతం మూడవ దశలో 59.94 శాతం నమోదయ్యాయి. నాటి బీహార్ ఎన్నికల్లో అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ) 125 సీట్లను గెలుచుకుని విజయం సాధించింది. రాష్ట్రీయ జనతాదళ్ నేతృత్వంలోని మహా కూటమి 110 అసెంబ్లీ నియోజకవర్గాలను గెలుచుకుంది.

## నేవీ అమ్ములపొదిలో మరో అస్త్రం



తీర ప్రాంతానికి చేరువలోని సాగరజలాల్లో శత్రు జలాంతర్గాముల ఉనికిని పట్టేసే యుద్ధనౌక 'అండ్రోత్' భారత నౌకాదళంలో చేరింది. విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రెండో 'యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్' 'ఆండ్రోత్' జలప్రవేశం చేసింది. నేవీ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధర్కర్ ఆధ్వర్యంలో దీన్ని కమిషనింగ్ చేశారు. భారత నౌకాదళం స్వదేశీకరణ ప్రయత్నాల్లో ఇది మరో మైలురాయిగా నిలిచింది. కోల్‌కతాలోని ప్రభుత్వరంగ నౌకా నిర్మాణ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) దీన్ని రూపొందించింది. ఈ శ్రేణిలో ఇది రెండో యుద్ధనౌక. మొదటిది ఐఎన్ఎస్ అర్నాలా. అది జూన్ 18న లాంఛనంగా భారత నౌకాదళంలో చేరింది. లక్షదీవుల్లోని అండ్రోత్ అనే దీవి పేరును రెండో యుద్ధనౌకకు ఖరారు చేశారు. ఆండ్రోత్ యుద్ధ నౌకలో దేశీయంగా రూపొందించిన 30 ఎంఎం సర్ఫేస్ గన్ ఉంది. లోతు తక్కువగా ఉన్న జలాల్లోని జలాంతర్గాములను వేటాడే 16 అధునాతన నౌకలకు నేవీ ఆర్డర్ పెట్టింది. ఇందులో ఎనిమిదింటిని జీఆర్ఎస్ఈ ఉత్పత్తి చేస్తోంది. తీర ప్రాంతానికి చేరువలోని జలాలపై నిఘా వేసే సామర్థ్యం వీటికి ఉంది. విమానాలతో సమన్వయం చేసుకుంటూ శత్రు జలాంతర్గాములను వేటాడగలవు. అధునాతన పోరాట నిర్వహణ వ్యవస్థలు వీటి సొంతం. ఈ యుద్ధనౌకల్లో తేలికపాటి టోర్పిడోలు, జలాంతర్గామి విధ్వంసక రాకెట్లు ఉన్నాయి.

## ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం.. పదవి చేపట్టిన నెలరోజులకే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా



ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. ఫ్రాన్స్ నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్నూ తాజాగా రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి ఆయన దిగిపోయారు గత నెల జాతీయ అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాంకోయిస్ బేరౌ ఓడిపోవడంతో.. సెబాస్టియన్‌ను తదుపరి ప్రధానిగా అధ్యక్షుడు ఎమ్మాన్యువల్ మాక్రన్ నియమించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత సెబాస్టియన్ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. అనంతరం రాజకీయ పార్టీలతో వారాల తరబడి సంప్రదింపులు జరిపిన అనంతరం ఆదివారం తన మంత్రివర్గాన్ని కూడా నియమించారు. నేడు మంత్రివర్గం తొలి సమావేశం కూడా నిర్వహించనుంది. మంత్రివర్గాన్ని నియమించిన గంటల వ్యవధిలోనే ప్రధాని సెబాస్టియన్ రాజీనామా చేయడం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఆయన రాజీనామాను అధ్యక్షుడు మాక్రన్ ఆమోదించినట్లు తెలుస్తోంది. కాగా, గత రెండేళ్లలో ఫ్రాన్స్‌లో రెండుసార్లు తాత్కాలిక ప్రభుత్వం నడిచింది. ఫ్రాన్స్ పార్లమెంట్‌లో ప్రధాని విషయంలో భిన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రధాని నియామకం మాక్రన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఆయన వద్ద రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయి. కొత్త ప్రధానిని నియమించడం లేదా జాతీయ అసెంబ్లీని రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహించడమే. గత రెండేళ్ల నుంచి ఇదే సమస్య వస్తున్నా.. ఎన్నికలు నిర్వహించేందుకు మాత్రం దేశాధ్యక్షుడు మొగ్గు చూపలేదు. ఒకవేళ ఈసారి ఎన్నికలకు వెళ్తే, ప్రభుత్వాన్ని రద్దు చేసిన 29 నుంచి 49 రోజుల మధ్య ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అత్యధిక సీట్లు గెలిచిన పార్టీ నుంచి ప్రధాని వ్యక్తిని అధ్యక్షుడు నియమిస్తారు.

# కనిపించని జోష్

-మొదటిపేజీ తరువాయి

రాజకీయ దావత్‌లు ఎక్కువగా ఉంటాయని అంతా భావించారు. కానీ, ఈసారి కొన్నిచోట్ల దావత్‌లు గట్టిగా జరిగితే.. మరికొన్నిచోట్ల 'ఇంకా సమయం ఉందిగా' అనే మాటతో సరిపెట్టేశారు. ఇందుకు కారణం.. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో రిజర్వేషన్లు మారడం, సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలు కావడం.. రెండు, మూడ్రోజుల్లో వాటిపై విచారణలు ఉండడమే. విచారణల తర్వాత కోర్టులు ఏం తీర్పునిస్తాయో చూసి, ముందుకెళ్తే బాగుంటుందని నాయకులు భావిస్తున్నారు. ఈ కారణంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో జోష్ కనబడడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి, రిజర్వేషన్లు మారడంతో తమకే టికెట్ వస్తుందనుకున్న వారికి నిరాశ ఎదురైంది. వాళ్లు చప్పుడు చేయడం లేదు. రిజర్వేషన్ల మార్పుతో టికెట్ తమకే వస్తుందనుకుంటున్న వారు కూడా కోర్టు విచారణల నేపథ్యంలో అడుగు ముందుకు వేయడం లేదు. ఖర్చు పెట్టకపోతే ఓటర్లు ఎటువైపు వెళ్తారోననే ఆందోళన ఒకవైపు.. ఇప్పుడే ఖర్చు చేస్తే కోర్టుల్లో తీర్పు వచ్చాక పరిస్థితి ఏమిటోననే భయం మరోవైపు వెన్నాడుతున్నాయి. ఓటర్లు తమవైపు చూస్తున్నారని, కోర్టు తీర్పుల్లో ఏం జరుగుతుంది? ఖర్చు చేయాలా వద్దా!? అంటూ పార్టీ కార్యాలయాలకు ప్రశ్నలు ఎదురవుతున్నాయి అని నాయకులు అంటున్నారు . కొన్నిచోట్ల మాత్రం ఓటర్లు చేజారిపోకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల రాత్రి సమావేశాలు మొదలయ్యాయి. వీటిలో ఖర్చే ప్రధానంగా చర్చకు వస్తోందని నాయకులు చెబుతున్నారు. ఉత్తర తెలంగాణలో కొన్నిచోట్ల ఖర్చులు మొదలుపెట్టగా, దక్షిణ తెలంగాణలో మోస్తారుగానే ఉంది. కొన్ని జిల్లాల్లో మధ్యస్థంగా ఉంది. మరి కొన్నిచోట్ల ఏకగ్రీవాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

**పార్టీలవారీగా అభ్యర్థుల జాబితాలు**

స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార, విపక్షాలు అభ్యర్థుల జాబితాల రూపకల్పనలో నిమగ్నమయ్యాయి. ఆయా స్థానాలవారీగా 5 వరకు పేర్లను పంపాలని డీసీసీలకు పీసీసీ సూచించింది. బీఆర్ఎస్ కూడా క్షేత్రస్థాయిలో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషిస్తోంది. గతంలో పార్టీ కోసం పని చేసిన వారు, బలంగా ఉన్నవారి కోసం చూస్తోంది. బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలని బీజేపీ భావిస్తోంది. అవసరమైన కసరత్తును ప్రారంభించింది. ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత నెలకొన్నా.. వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదనే ఉద్దేశంతో జాబితాల్లో తమ పేరు ఉండేలా కొంతమంది ప్రయత్నాలు చేసుకుంటున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోని ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలన్నీ ఆశావహులతో నిండిపోతున్నాయి. మరోవైపు పొత్తుల కోసం కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హఠాన్మరణంతో ఖాళీ అయిన ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటే దీనికి కూడా ఉప ఎన్నిక జరగనుందన్న సంకేతాలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ ఉప ఎన్నిక అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారడంతో, గెలుపు కోసం రెండు పార్టీలు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమవుతున్నాయి.గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ స్థానాన్ని కైవసం చేసుకున్న బీఆర్ఎస్, ఈ ఉప ఎన్నికలోనూ తమ జెండా ఎగురవేయాలని పట్టుదలగా ఉంది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీతను బీఆర్ఎస్ తమ అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో ప్రత్యర్థుల కన్నా ఒక అడుగు ముందుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడం ద్వారా, రాష్ట్రంలో తమకు ప్రజాబలం తగ్గలేదని నిరూపించుకోవాలని భావిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, పాలన విఫలమైందని బీఆర్ఎస్ నేతలు బలంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఉప ఎన్నికలో గెలుపు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు, భవిష్యత్ రాజకీయాలకు ఒక సంకేతంగా పనిచేస్తుందని ఆ పార్టీ నాయకత్వం విశ్వసిస్తోంది. క్షేత్రస్థాయిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ, ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసింది.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఈ ఉప ఎన్నిక ఒక అగ్నిపరీక్షగా మారింది. బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలంటే జూబ్లీహిల్స్‌లో గెలుపు తప్పనిసరి అని కాంగ్రెస్ భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలు వంటి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని చూస్తోంది. ఈ ఎన్నికలో గెలిస్తే, ప్రభుత్వ పనితీరుకు ప్రజల ఆమోదం లభించినట్లవుతుందని, ప్రతిపక్షాల నోరు మూయించవచ్చని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. ఈ స్థానాన్ని బీఆర్ఎస్ నుంచి కైవసం చేసుకోవడం ద్వారా, రాజధాని నగరంలో పట్టు సాధించాలని కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.గెలుపు అత్యంత కీలకంగా మారిన ఈ తరుణంలో, కాంగ్రెస్ పార్టీ ఇంకా తమ అభ్యర్థిని ఖరారు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటమే ఈ జాప్యానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, గతంలో పోటీ చేసిన వారు, కొత్తగా పార్టీలో చేరిన బలమైన నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమకే గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, తమకు సామాజికవర్గాల బలం ఉందని అధిష్టానం వద్ద తమ వాదనలు వినిపిస్తున్నారు. ఎక్కువ మంది ఆశావహులు ఉండటం పార్టీకి బలమే అయినా, అభ్యర్థి ఎంపికలో జాప్యం చేయడం వల్ల ప్రచారంలో వెనుకబడతామనే ఆందోళన పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అభ్యర్థి ఎంపిక బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులకు అప్పగించారు. ఇందుకోసం ఓ కమిటీని ఏర్పాటు చేశారుఅభ్యర్థి ఎంపికలో ఆలస్యం జరిగే కొద్దీ పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టికెట్ దక్కని నేతలు అసంతృప్తికి గురై, పార్టీ అధికారిక అభ్యర్థికి వ్యతిరేకం గా పనిచేసే అవకాశం ఉంటుంది. వారిని బుజ్జగించి, అందరినీ ఏకతాటిపైకి తీసుకురావడం అధిష్టానానికి సవాలుగా మారనుంది. ఈ లోపు ప్రత్యర్థి పార్టీ ప్రచారంలో మరింత ముందుకు దూసుకుపోతుంది. వీలైనంత త్వరగా సర్వేలు, అంతర్గత సమీక్షల ఆధారంగా గెలుపు గుర్రాన్ని ఎంపిక చేసి, పూర్తిస్థాయిలో ప్రచార బరిలోకి దిగాలని, లేకపోతే చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా మారుతుందని కాంగ్రెస్ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

**కమలంలో కనిపించని జోష్**

జూబ్లిహిల్స్ ఉపఎన్నిక విషయంలో భారతీయ జనతా పార్టీ అంటీ ముట్టనట్లుగా ఉంది. అభ్యర్థి గురించి ఎలాంటి కసరత్తు చేయలేదు. నేడో రేపో నోటిఫికేషన్ వస్తుందని అనుకుంటున్న సమయంలో హఠాత్తుగా అభ్యర్థి ఎంపిక కోసం ముగ్గురు సభ్యులతో ఓ కమిటీ వేశారు. ఆ కమిటీలో ఉన్న ముగ్గురు ఎవరో చాలా మందికి తెలియదు. ఎవరికీ తెలియని నేతలు పార్టీ అభ్యర్థిని సిఫారసు చేయడం ఏమిటో తెలియక చాలా మంది బీజేపీ నేతలే ఆశ్చర్యపోతున్నారు.గత ఎన్నికల్లో లంకల దీపక్ రెడ్డి పోటీ చేశారు. ఈ సారి కూడా పోటీ చేయడానికి ఆసక్తితో ఉన్నారు. అదే సమయంలో తాము పోటీ చేస్తామని ఆ పార్టీలో పోటీపడుతున్న వారు కూడా లేరు. సాధారణంగా ఇలాంటి ఉపఎన్నికల్లో పోటీ చేయడానికి చాలా మంది ముందుకు రావాలి. కానీ ఇక్కడ మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేసి ప్రచారం చేసుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేసినా ప్రకటించుకోలేని పరిస్థితుల్లో ఉంది. హైకమాండ్ ప్రకటించేలా ప్రాసెస్ ప్రారంభించింది.బీజేపీకి జూబ్లిహిల్స్‌లో కొంత బలం ఉంది. విజయానికి ఎప్పుడూ దగ్గరగా రాలేదు కానీ.. స్థిరమైన ఓటు బ్యాంక్ మాత్రం ఎప్పుడూ ఫలితాల్లో కనిపిస్తూనే ఉంటుంది. ఈ సారి కూడా గెలిచే అవకాశం లేదన్న కారణంగా .. పెద్దగా ఆసక్తి చూపించడం లేదని అంటున్నారు. కానీ మూడు పార్టీల మధ్య హోరాహోరీలో ఏమైనా జరగవచ్చని బలమైన అభ్యర్థిని నిలబెడితే.. పోటీలో ఉండవచ్చని బీజేపీ క్యాడర్ అనుకుంటున్నారు.

# లోకల్ బాడీ ఎన్నికల్లో టీ'ఢీ' పీ

**ఖమ్మం :** తెలంగాణలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అన్ని పార్టీలు సన్నాహాలు చేసుకుంటున్నాయి. అభ్యర్థులను బరిలో దించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రధానంగా అక్కడ అధికార కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే ఆ మూడు పార్టీలకు ఇప్పుడు గెలుపు ముఖ్యం. అలా గెలవాలంటే గ్రౌండ్ లెవెల్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ మద్దతు అవసరం. అసలు తెలుగుదేశం పార్టీ నాయకత్వం అభిప్రాయం ఏంటి? అనేది మాత్రం తెలియడం లేదు. మొన్న ఆ మధ్యన హడావిడి చేసిన టిడిపి నాయకత్వం ఇప్పుడు వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తోంది. దీంతో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి పోటీ చేస్తుందా? లేకుంటే తప్పుకుంటుందా? లేకుంటే ఏ పార్టీకైనా మద్దతు తెలుపుతుందా? అన్నది మాత్రం తెలియడం లేదు. వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తే తప్పకుండా అది కాంగ్రెస్ పార్టీకి లాభం చేకూర్చినట్టే.తెలంగాణలో తెలుగుదేశం పార్టీని దారుణంగా దెబ్బతీశారు కెసిఆర్. అందుకే అక్కడ టిడిపి శ్రేణులు గులాబీ పార్టీ వైపు వెళ్లే ఛాన్స్ లేదు. అయితే ఏపీలో బిజెపితో కలిసి ఉంది తెలుగుదేశం. ఎన్డీఏ లో కీలక భాగస్వామి. అయితే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని కలుపు కెళ్లే ప్రయత్నం చేయలేదు బిజెపి. 2023 ఎన్నికల్లో సైతం జనసేనతో కలిసి వెళ్ళింది తప్ప టిడిపి తో కలిసి వెళ్లేందుకు ఇష్టపడలేదు. అందుకే బిజెపి పట్ల టిడిపి శ్రేణుల్లో ఒక రకమైన అసహనం ఉంది. కాంగ్రెస్ పార్టీకి నేరుగా మద్దతు తెలిపే ఛాన్స్ లేదు. అందుకే ఇప్పుడు టిడిపి ప్రకటన కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు ఆశగా ఎదురుచూస్తున్నాయి.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి నాయకులు లేరు. కానీ క్యాడర్ మాత్రం ఉంది. ఖమ్మం( లాంటి జిల్లాల్లో ఇప్పటికీ టిడిపి శ్రేణులు యాక్టివ్ గానే ఉన్నారు. 2023 ఎన్నికల నాటికి చంద్రబాబు జైల్లో ఉన్నారు.



అందుకే అక్కడ తెలుగుదేశం పార్టీ పోటీ చేయలేదు. అయితే అప్పట్లో టిడిపి వ్యూహాత్మక మౌనం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీకి వరంగా మారింది. కాంగ్రెస్ విషయంలో టిడిపి శ్రేణులకు భిన్న వైఖరి ఉన్న.. రేవంత్ రూపంలో చంద్రబాబును చూసుకుంటారు అక్కడి టిడిపి క్యాడర్. అందుకే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలుగుదేశం పార్టీ పరోక్ష సహకారం అందించినట్టే. పోటీ చేయకపోవడంతో టీడీపీ శ్రేణులు కాంగ్రెస్ వైపు టర్న్ అయ్యాయి. అయితే మొన్న ఆ మధ్యన తెలంగాణలో టిడిపి భవన్ కు వచ్చారు నారా లోకేష్. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం అంటూ పిలుపునిచ్చారు. ఇప్పుడు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా టిడిపి నాయకత్వం నుంచి కదలిక లేదు. అందుకే టిడిపి ప్రకటన కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు ఆశగా ఎదురుచూస్తున్నాయి. మరి టిడిపి హై కమాండ్ ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో చూడాలి.

# జగ్గారెడ్డి స్ట్రాంగ్ డెసిషన్ వెనుక...

**మెదక్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించి సంచలనానికి తెరతీశారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెస్ దే అధికారం అని ప్రకటిస్తున్న సమయంలో జగ్గారెడ్డి తాత్కాలిక రాజకీయ బ్రేక్ ఎందుకన్నది ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ కు వచ్చే ఎన్నికల్లో అధికారం దక్కదని జగ్గారెడ్డి భావిస్తున్నారా? లేక తాను పోటీ చేస్తే సంగారెడ్డి నుంచి గెలిచే అవకాశం ఉండదని ఆయనకు ఏమైనా నివేదికలు అందాయా? అన్న విషయాలు బయటకు చెప్పకపోయినా తాను పదేళ్ల పాటు పోటీకి దూరంగా ఉంటానని జగ్గారెడ్డి చెప్పడం నియోజకవర్గంలోనే కాకుండా పార్టీలో కూడా హాట్ టాపిక్ గా మారింది. తూర్పు జయప్రకాశ్ రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి ఇప్పటికి మూడు సార్లు ఎమ్మెల్యేగా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి గెలిచారు. తొలిసారి 2004లో నాటి టీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన జగ్గారెడ్డి ఆ ఎన్నికల్లో గెలిచారు. తర్వాత టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారారు. పార్టీ మారినప్పటికీ 2009 లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జగ్గారెడ్డి విజయం సాధించారు. అయితే తర్వాత 2014 ఎన్నికల్లో మాత్రం రాష్ట్ర విభజన జరిగిన వెంటనే జరిగిన ఎన్నికల్లో సంగారెడ్డిలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2018 ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడి విజయం సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో మాత్రం జగ్గారెడ్డి సంగారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. పోటీ చేసి ఓటమి పాలు కావడంతో ఆయనకు ఏ పదవి దక్కలేదు. . అందుకే ఈసారి జగ్గారెడ్డి మనసు మార్చుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తన సతీమణి నిర్మల బరిలో ఉంటారని చెప్పారు. పదేళ్ల పాటు తాను పోటీకి దూరంగా ఉంటానని ఆయన కార్యకర్తలకే తెలిపారు. ఒకవేళ తాను పోటీ చేసి మరోసారి ఓటమి పాలయితే ఏ పదవి లేకుండా ఉండాల్సి వస్తుందనా? లేక కొత్త వారికి అవకాశం ఇచ్చినట్లవుతుందనా? అన్నది మాత్రం అర్థం కాకుండా ఉంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవచ్చన్న అంచనాకు ఆయన వచ్చారా? అన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. అయితే పదేళ్లు గ్యాప్ తీసుకుని తిరిగి పోటీ చేస్తామనడం ఏరకమైన వ్యూహమన్నది క్యాడర్ కు కూడా అర్థం కాకుండా ఉంది. అయితే తన సతీమణి పోటీలో ఉంటుందని చెప్పడంతో కార్యకర్తలకు ఆయన టచ్ లోనే ఉంటూ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. మొత్తం మీద జగ్గుభాయ్ నిర్ణయం వెనక మతలబు ఏమిటన్నది ఎవరికి అంతుపట్టని విధంగా ఉంది.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదల

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ ఈ ఏడాది జూన్‌లో ఆయన గుండెపోటుతో కన్నుమూశారు. దీంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతా గోపీనాథ్‌కు కేసీఆర్ టికెట్ కేటాయించారు. ఇక కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్‌లు జూబ్లీహిల్స్ సీటు ఆశిస్తున్నారు. కానీ వీరిలో నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, సీఎన్ రెడ్డి పేర్లను కాంగ్రెస్ అధిష్టానానికి రేవంత్ సర్కార్ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. వీరిలో ఒకరిని త్వరలోనే ఖరారు చేసే అవకాశం ఉంది.

## సర్కార్‌కు సుప్రీంకోర్టులో ఊరట



**ఢిల్లీ:** తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట దక్కింది. తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ వంగ గోపాల్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ సందర్భంగా హైకోర్టుకు వెళ్లి తేల్చుకోవాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం.. పిటిషనర్‌కు సూచించింది. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంలో గోపాల్ రెడ్డి పిటిషన్‌పై విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించిందన్న పిటిషనర్ తరఫు లాయర్ వివరణ ఇచ్చారు. అనంతరం, ధర్మాసనం రిజర్వేషన్లపై హైకోర్టులో స్టే నిరాకరిస్తే ఇక్కడికి వస్తారా? అని ప్రశ్నించింది. ఈ క్రమంలో హైకోర్టుకే వెళ్లాలని ఆదేశించింది. దీంతో, పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టు చెప్పడంతో తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది అంగీకరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి ఊరట లభించింది. అంతకుముందు.. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-9 అమలుపై స్టే ఇవ్వాలని పిటిషన్‌లో గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయని పిటిషన్‌లో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఇతర రిజర్వేషన్లు అన్నీ కలిపి కూడా 50 శాతం రిజర్వేషన్ దాటవద్దని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ప్రస్తావించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన సీలింగ్‌ను ఎత్తివేస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎస్సీలకు15 శాతం రిజర్వేషన్, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు ఇచ్చే రిజర్వేషన్ 42 శాతంతో కలుపుకుంటే మొత్తం రిజర్వేషన్లు 67 శాతం అవుతున్నదని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే జీవో 9ను తక్షణమే రద్దుచేయాలని కోరారు. ఇది ముమ్మాటికీ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 285కు విరుద్ధమని పిటిషన్‌లో తెలిపారు.

## సుప్రీంకోర్టు తీర్పు శుభపరిణామం

-మొదటిపేజీ తరువాయి

కోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తాం. ఇప్పటికే ప్రభుత్వం మూడు చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లు రిజర్వేషన్ల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఎనిమిదో తేదీన హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నాము. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం అన్ని వర్గాలు ప్రభుత్వానికి సహకరించాలి' అని కోరారు. మరోవైపు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..'ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించాం. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వేసిన పిటిషన్ కొట్టేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం' అని చెప్పుకొచ్చారు.

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో 100 శాతం బీసీకే సీటు..

-మొదటిపేజీ తరువాయి

పేరిట మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కుటుంబాన్ని రోడ్డు మీద పడేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

**అన్ని రకాల రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకం: మంత్రి పొన్నం**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ అంశంలో అసెంబ్లీలో చట్టబద్ధంగా ఆమోదించుకుని ముందుకు వెళు న్నామని తెలిపారు. తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ నేపథ్యంలో పొన్నం మీడియాతో మాట్లాడారు. "వాస్తవంగా భాజపా అన్ని రకాల రిజర్వేషన్లకు వ్యతిరేకం. బీసీ రిజర్వేషన్లపై చట్ట సవరణ బిల్లు, ఆర్డినెన్స్‌ను అడ్డుకుంటున్నదే భాజపా నేతలు. రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆ పార్టీ నేతలు ఆమోదించి.. ఇప్పుడు మాట మారుస్తున్నారు. ఆ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బిల్లులను ఆమోదింపచేయాలి. భాజపా ఫ్యూడలిస్టు పార్టీ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం. గతంలో రామచందర్‌రావు హెచ్‌సీయూలో ఎస్సీలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. శాసనసభలో మద్దతు ఇచ్చిన భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు న్యాయ ప్రక్రియలోనూ సహకరించాలి" అని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## భూముల కేటాయింపులపై లెక్కలు తేల్చాలి..



**హైదరాబాద్:** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణపై అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రెవెన్యూ భూముల కేటాయింపులపై లెక్కలు తేల్చాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ వేగవంతం చేయాలని సూచించారు. గత 30-40 సంవత్సరాలుగా రెవెన్యూ శాఖ తరఫున వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు, వినియోగం, ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. రాష్ట్ర విభజన తర్వాత పలు ప్రాజెక్టుల్లో మార్పులు, రద్దులు జరిగిన నేపథ్యంలో వాటి లెక్కలు చూపాలని ఆయన పేర్కొన్నారు. అటవీ శాఖకు రెవెన్యూ శాఖ ఇచ్చిన భూమి, అలాగే అటవీ శాఖ రెవెన్యూ శాఖకు ఇచ్చిన భూములపై వివరాలను రెండు శాఖలు కలిసి నివేదిక ఇవ్వాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1138 ఎకరాల అటవీ భూమి కేటాయింపును వేగవంతం చేయాలని తెలిపారు. కేశవపురం త్రాగునీటి పథకం కోసం గతంలో కేటాయించిన 1030 ఎకరాల భూమి ప్రాజెక్ట్ రద్దు చేశారని గుర్తు చేశారు. ఆ భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదిలీ చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి, అటవీ పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, పీసీసీఎఫ్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## విశ్వమానవ ఉత్సవం

ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. వ్యవసాయ రంగంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన పత్తి పంట కేవలం వస్త్ర పరిశ్రమకే కాదు, కోట్లాది మంది రైతుల జీవనాధారంగా నిలుస్తుంది. తెల్ల బంగారం అని పిలువబడే ఈ పంటకు అంతర్జాతీయ స్థాయిలో గౌరవం కల్పించడం లక్ష్యంగా ఐక్యరాజ్య సమితి ఆహార మరియు వ్యవసాయ సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్య సమితి వాణిజ్యాభివృద్ధి సదస్సు వంటి అంతర్జాతీయ సంస్థలు కలిసి 2019లో మొదటిసారిగా ప్రపంచ పత్తి దినోత్సవాన్ని ప్రారంభించాయి. 2019 అక్టోబర్ 7న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ ఆధ్వర్యంలో జరిపారు. పత్తి ఉత్పత్తి దారులు, వ్యాపారులు, దుస్తుల తయారీ పరిశ్రమ, రైతులు, మరియు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ పంట ప్రాధాన్యాన్ని గుర్తు చేసుకునే రోజు ఇది. పత్తి కేవలం ఒక పంట మాత్రమే కాదుబీ అది లక్షలాది మంది రైతుల జీవనాధారం, దుస్తుల పరిశ్రమకు మూలాధారం, ప్రపంచ వ్యాపార చరిత్రలో ఒక ప్రధాన విభాగం.ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం పత్తి పంట యొక్క ప్రాధాన్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించటం, దాని ఉత్పత్తి, వ్యాపారం, పర్యావరణ అనుకూలత, ఆర్థిక ప్రాధాన్యతలపై అవగాహన కల్పించడం. పత్తి రైతులు ఎదుర్కొనే సమస్యలు, ధరల మార్పులు, వాతావరణ మార్పుల ప్రభావం వంటి అంశాలపై చర్చించటానికి, స్థిరమైన సాగు పద్ధతులను ప్రోత్సహించటానికి ఈ దినోత్సవం ఒక అంతర్జాతీయ వేదికగా నిలుస్తుంది.ప్రపంచ వ్యాప్తంగా ఎనభైకి పైగా దేశాలు పత్తిని సాగు చేస్తున్నాయి. చైనా, భారతదేశం, అమెరికా, బ్రెజిల్, పాకిస్థాన్, టర్కీ వంటి దేశాలు ప్రధాన ఉత్పత్తిదారులు. వీటిలో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి సాగు దేశంగా నిలుస్తుంది. దేశంలోని మహారాష్ట్ర, తెలంగాణ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు పత్తి ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలోని ఎండ ప్రాంతాలు, వర్షాధారిత భూభాగాలు పత్తి సాగుకు అత్యంత అనుకూలమైనవిగా గుర్తించబడ్డాయి. భారతదేశం ప్రపంచ పత్తి ఉత్పత్తిలో కీలక స్థానం కలిగి ఉంది. చైనా తరువాత భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారు. దేశవ్యాప్తంగా సుమారు 130 లక్షల హెక్టార్ల భూమిలో పత్తి సాగు జరుగుతోంది. సంవత్సరానికి సగటున 360–400 లక్షల గింజల బేళ్ల ఉత్పత్తి అవుతుంది. ముఖ్యంగా మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు ప్రధాన పత్తి ఉత్పత్తి ప్రాంతాలు. భారతదేశం ప్రపంచ పత్తి ఎగుమతుల్లో కూడా మొదటి మూడు స్థానాల్లో ఉంటుంది. “మేడ్ ఇన్ ఇండియా కాటన్” అనే పేరుతో భారత పత్తి ప్రపంచ మార్కెట్లో నాణ్యతకు ప్రతీకగా నిలుస్తోంది. పత్తి పంట కేవలం వస్త్ర తయారీకి మాత్రమే కాకుండా అనేక అనుబంధ రంగాలకు ప్రాణాధారంగా నిలుస్తుంది. పత్తి విత్తనాల ద్వారా నూనె, పిండి, పశువుల మేత తయారీ జరుగుతుంది. అలాగే టెక్స్టైల్ మిల్లులు, హ్యాండ్లూమ్ పరిశ్రమలు, తాడు తయారీ, మెడికల్ కాటన్ ఉత్పత్తులు వంటి అనేక రంగాలకు పత్తి ప్రధాన ముడి సరుకుగా ఉంది. ఈ విధంగా పత్తి పంట దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థంభంగా నిలుస్తుంది. ప్రపంచ పత్తి దినోత్సవం సందర్భంగా పత్తి రైతుల సంక్షేమం, వారికి సరైన ధర భరోసా, కొత్త రకాల విత్తనాల అభివృద్ధి, నీటి వనరుల సమర్థ వినియోగం, పర్యావరణ అనుకూల సాగు విధానాల ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రభుత్వాలు, పరిశోధనా సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు చర్చలు నిర్వహిస్తాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధిలో ప్రారంభమైన “కాటన్–4” ప్రాజెక్టు (బుర్కినా ఫాసో, చాద్, మాలి, నైజర్) పత్తి ఉత్పత్తి దేశాల అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి కోసం రూపొందించ బడింది. పత్తి పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడే పంట. ఇది సహజమైన, బయో డిగ్రేడబుల్ ఫైబర్ కావడంతో ప్లాస్టిక్, పాలిస్టర్ వంటి కాలుష్య కారక పదార్థాలకు ప్రత్యామ్నాయం అందిస్తుంది. పత్తి ద్వారా తయారయ్యే వస్త్రాలు పర్యావరణానికి మేలు చేసే స్థిరమైన వినియోగ పదార్థాలుగా నిలుస్తాయి. “కాటన్ ఈజ్ లైఫ్” అనే నినాదం పత్తి మనిషి జీవితంలో ఉన్న అంతర్భాగాన్ని ప్రతిబింబిస్తుంది.భారతదేశంలో ఈ రోజు సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వ విద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు పత్తి రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణలు, విత్తనాల ప్రదర్శనలు, ఎగుమతుల ప్రోత్సాహం, టెక్స్టైల్ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాల పరిచయం వంటి అనేక కార్యక్రమాలు ఈ రోజున నిర్వహించ బడతాయి. పత్తి పంట కేవలం వ్యవసాయం కాదు, అది గ్రామీణ భారత ఆర్థిక జీవితానికి నాడిగా ఉంది. రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ “రైతుల కృషి, కూలీల శ్రమ, పరిశ్రమల అభివృద్ధి, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణఈ అన్ని కలిపి పత్తిని నాగరికతకు ప్రతీకగా నిలుస్తాయి.” అందువల్ల అక్టోబర్ 7 ప్రపంచ పత్తి దినోత్సవం కేవలం ఒక పంటకు గౌరవ దినం కాదుబీ అది రైతుల శ్రమకు, ప్రకృతి ప్రసాదానికి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు అంకితమైన విశ్వమానవ ఉత్సవం. తెల్ల బంగారం అయిన పత్తి సమృద్ధి మానవ సమాజ అభివృద్ధికి మూలాధారం.


### శ్రామికుల చైతన్యాన్ని పెంచే

# శ్రామిక దినోత్సవం



ప్రతి సంవత్సరం అక్టోబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం జరుపుకుంటారు. ఈ దినోత్సవం శ్రామికుల హక్కులు, సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం, సమాన అవకాశాలు, న్యాయపరమైన వేతనం, సామాజిక భద్రత వంటి అంశాలను అంతర్జాతీయ స్థాయిలో గుర్తించడానికి, ప్రోత్సహించడానికి, శ్రామికుల జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి ప్రత్యేక వేదికగా మారింది. ఇది కేవలం ఒక సాంప్రదాయ, గుర్తింపు రోజు మాత్రమే కాదు. ప్రతి దేశం, ప్రతి సంస్థ, ప్రతి వ్యక్తి శ్రామికుల హక్కులు, భద్రత, గౌరవం కోసం కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తు చేసుకునే, చైతన్యం పెంచే, సమాజంలో సమానత్వం, న్యాయం, శాంతి మరియు ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడానికి ముఖ్యమైన ఒక వేదిక. మంచి పని అంటే కేవలం జీతం పొందే అవకాశం మాత్రమే కాదు. అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రకారం, ఇది వ్యక్తికి సామాజిక గౌరవం, భద్రత, వృత్తిపరమైన అభివృద్ధి, జీవన ప్రమాణాలను మెరుగుపరచే అవకాశాలను కల్పించే పని పరిస్థితులను సూచిస్తుంది. మంచి పని లక్షణాల్లో సరసమైన వేతనం, పని స్థలంలో హక్కులు, సామాజిక భద్రత, భద్రత కలిగిన పని వాతావరణం, సమాన అవకాశాలు ముఖ్యంగా ఉంటాయి. సరసమైన వేతనం అంటే పనికి తగిన, గౌరవంగా జీవించడానికి సరిపడే వేతనంబీ పని హక్కులు అంటే యూనియన్లలో చేరే, సమిష్టి బేరసారాలు చేసుకునే హక్కుతో పాటు ప్రాథమిక హక్కులను గౌరవించడంబీ సామాజిక భద్రత అంటే ఆరోగ్య సంరక్షణ, పెన్షన్, సెలవులు, ప్రసూతి సెలవులు వంటి రక్షణలను కల్పించడంబీ పని భద్రత అంటే సురక్షితమైన, ప్రమాదము లేనిది, ఆరోగ్యకరమైన వాతావరణంబీ సమాన అవకాశాలు అంటే లింగం, జాతి, మతం ఆధారంగా వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశం కల్పించడం. ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవం 2008లో అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ కాన్ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమై, శ్రామికుల హక్కుల పరిరక్షణ, సమాజంలో సమానత్వం, ఆర్థిక వృద్ధికి పునాదులు వేయడానికి కీలకంగా మారింది. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో సెమినార్లు, వర్క్‌షాప్‌లు, ర్యాలీలు, చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో శ్రామికుల సమస్యలు, నూతన శ్రామిక విధానాలు, భద్రతా మార్గదర్శకాలు, యువ శ్రామికుల పరిస్థితులు, స్త్రీ శక్తి ఉద్యోగాల్లో సమన్వయం వంటి అంశాలను చర్చిస్తారు. ప్రధానంగా శ్రామికుల హక్కుల పరిరక్షణ, సమాన జీతాలు, పని వేళల నియంత్రణ, స్త్రీ–పురుషుల సమాన అవకాశాలు, సురక్షిత పని వాతావరణం, ప్రమాదాల నివారణ, వృత్తిపరమైన గుర్తింపు, ఉద్యోగ సంఘాల మద్దతు, ఆర్థిక స్థిరత్వం, సమాజంలో సమానత్వం వంటి అంశాలను ప్రాధాన్యం ఇస్తారు. ఈ విధంగా ప్రతి పని స్థలం వ్యక్తులకు గౌరవప్రదమైన, భద్రత కలిగిన, సమానత్వంతో కూడిన పని పరిస్థితులను కల్పించ గలుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేక థీమ్‌తో ఈ రోజును జరుపుకుంటారు. దీని ద్వారా శ్రామికులు మరియు కార్మిక సంఘాలు శాంతి, ప్రజాస్వామ్యం, సమానత్వం, భద్రత కలిగిన పని స్థలాలను సృష్టించడంలో తమ కృషిని కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటారు. భారత దేశంలో, అనధికారిక రంగంలో పనిచేసే శ్రామికులు, మహిళా శ్రామికులు, యువ శ్రామికులు ఇంకా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం భారతదేశంలో కూడా శ్రామికుల హక్కుల పరిరక్షణకు, సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం సృష్టించడానికి ఒక ముఖ్యమైన వేదికగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 2.78 మిలియన్ల మంది శ్రామికులు పని సంబంధిత గాయాలు, వ్యాధుల కారణంగా మరణిస్తారు. 374 మిలియన్ల మంది గాయపడ్డారు. ఈ గణాంకాలు శ్రమ భద్రతా మార్గదర్శకాలు, శ్రామిక హక్కుల పరిరక్షణ, సురక్షిత పని వాతావరణం అవసరాన్ని స్పష్టంగా చూపుతాయి. మంచి పని కోసం ప్రపంచ దినోత్సవం శ్రామికులు జీవన ప్రమాణాలను పెంచే, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించడంలో, సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడంలో కీలకంగా మారింది. ఇది ప్రతి వ్యక్తి, ప్రతి సమాజం, అంతర్జాతీయ స్థాయిలో సమానమైన, భద్రత కలిగిన, గౌరవ ప్రదమైన పని పరిస్థితులను సాధించే పునాదిని సృష్టిస్తుంది. ఈ సందర్భం ప్రతి దేశం, ప్రతి సంస్థ, ప్రతి వ్యక్తి శ్రామికుల హక్కులు, భద్రత, గౌరవం కోసం కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తు చేసుకోవడానికి గొప్ప అవకాశం. మన సమాజం, వృత్తిపరంగా ఎదుగుతున్న ప్రతి వ్యక్తి ఈ దినోత్సవం ద్వారా మంచి పని, సమానత్వం, భద్రత మరియు గౌరవం కోసం చురుకుగా కృషి చేయాలి.

# తెలుగు భాషా మార్గదర్శకులు



తెలుగు సాహిత్య చరిత్రలో భాషా శాస్త్ర పరిశోధనలకు, విద్యా రంగాభివృద్ధికి, సాహిత్య సృజనకు జీవితాన్నంతా అంకితం చేసిన మహనీయ పండితుడు గంటి జోగి సోమయాజి. ఆయన ఒక సమగ్ర పండితుడు ౧ భాషావేత్త, కవి, గురువు, కులపతి, తాత్త్వికుడు. తెలుగు భాషను శాస్త్రీయంగా విశ్లేషించి దాని మూలాలు, వ్యాకరణం, రూప నిర్మాణం, ధ్వన్యాత్మక స్వరూపం వంటి అంశాలను సునిశితంగా పరిశీలించి తెలుగు భాషా శాస్త్రానికి స్థిరమైన పునాదిని ఏర్పరచిన మహామేధావి. గంటి జోగి సోమయాజి 1900 అక్టోబరు 7న అప్పటి విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లిలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు సూరమ్మ, అప్పల నరసింహం. బాల్యంలోనే సంస్కృతం, తెలుగు భాషలపై ఆసక్తి కలిగిన ఆయన విద్యాభ్యాసం విజయనగరం మహారాజా కళాశాలలో సాగింది. 1917–19 మధ్య రసాయన శాస్త్రంలో బీఎస్సీ పూర్తి చేసి, తరువాత 1921లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1926లో తెలుగు, సంస్కృత భాషలలో విద్వాన్ డిగ్రీతో పాటు ఎల్.టి. (లైసెన్షియేట్ ఇన్ టీచింగ్) పూర్తి చేశారు. అదోని ఉన్నత పాఠశాలలో రసాయన శాస్త్ర ఉపాధ్యాయునిగా తన వృత్తిని ప్రారంభించిన ఆయన, అక్కడే తన పినతండ్రి గంటి సూర్యనారాయణ శాస్త్రి వద్ద సంస్కృతం అభ్యసించారు. సేవలో ఉన్నప్పుడే సంస్కృతంలో ఎం.ఎ. పట్టా పొందడం ఆయనలోని విద్యా తపనకు నిదర్శనం. తరువాత మద్రాసులోని పచ్చయప్ప కళాశాలలో సంస్కృత ఉపన్యాసకునిగా మూడు సంవత్సరాలు పనిచేశారు. 1933లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ఉపన్యాసకునిగా నియమితులై, 1963 వరకు విశ్వ విద్యాలయానికి, విద్యార్థి సమాజానికి విశిష్ట సేవలందించారు. సోమయాజి భాషా శాస్త్ర పరిశోధన భాషా అధ్యయన చరిత్రలో మైలురాయి. తెలుగు మాతృభాష అయినా, ఆయన ద్రావిడ భాషలపై విశేష ఆసక్తి కనబరిచి కన్నడంలో విద్వాన్ పట్టా పొంది, తమిళం, మలయాళ భాషలలో కూడా నిష్ణాతులయ్యారు. ఈ భాషల పరస్పర సంబంధం, మూల శబ్ద పరిణామం, ధ్వన్యనుసరణలు వంటి అంశాలను పరిశీలించి ద్రావిడ భాషల మధ్య వారధిగా నిలిచారు. 1947లో రచించిన “ఆంధ్ర భాషా వికాసము” గ్రంథం ఆయన సాహిత్య జీవితపు శిఖరాగ్ర సృష్టి. ఈ గ్రంథంలో తెలుగు భాషా చరిత్రను శాస్త్రీయంగా విశ్లేషించి, ద్రావిడ భాషల మూలాలు, తెలుగు పదాల వ్యుత్పత్తి, భాషా పరిణామ దశలను స్పష్టంగా నిర్ధారించారు. ఇది తెలుగు భాషా పరిశోధకులకు మార్గదర్శక గ్రంథంగా నిలిచింది. భాషా పరిణామాన్ని వేద సంస్కృతం నుండి ఆంధ్ర ప్రాకృతం, ఆంధ్ర అపభ్రంశం, చివరకు ఆధునిక తెలుగు దశకు ఎలా మారిందో ఆయన సవివరంగా వివరించారు. భాషాశాస్త్రంలో ఆయన కృషితో పాటు సాహిత్య రచనల లోనూ ఆయన ప్రతిభ అద్భుతంగా ప్రతిఫలించింది. కవిగా, నవలా రచయితగా, జీవిత చిత్రకర్తగా ఆయన బహుముఖ ప్రతిభ కలిగినవారు. “బసవ చరిత్ర” (1925), “వంశోద్ధారకుడు” (1927), “ధర్మ సామ్రాజ్యము” (1929), “రామచంద్రుని హంపీ యాత్ర” (1930) వంటి గ్రంథాలు ఆయన సాహిత్య బహుముఖతకు నిదర్శనం. ముఖ్యంగా “రామచంద్రుని హంపీ యాత్ర”లో విజయనగర సామ్రాజ్య వైభవం, ఆధ్యాత్మికత, కళా సంపదను చిత్రీకరించారు. 1948లో వచ్చిన “కొత్త లాంతర్లు” ద్వారా సమాజంలోని మార్పులను సాహిత్య రూపంలో ప్రతిబింబించారు. ఆయన రచించిన “శ్రీ రాధాకృష్ణ ప్రభ” (1970) సంస్కృత పద్యకావ్య రూపంలో భారతదేశం యొక్క మహానుభావుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రను ప్రస్థావిస్తూ, భారతీయ విద్యాభవనం ద్వారా ప్రచురించబడింది. ఆయన కవిత్వం క్లాసికల్ శైలీ గంభీరతను, ఆధునిక ఆలోచన స్పష్టతను కలిపినది. సంస్కృత కవిత్వంలోని లయ, తాత్త్వికత, తెలుగు పదసంపదలోని మాధుర్యం ఆయన పద్యాల్లో సమన్వితమ య్యాయి. కవిత్వం ద్వారా ఆయన జ్ఞానం, భక్తి, తాత్త్వికత, సౌందర్య భావాలను సమపాళ్లలో వ్యక్తం చేశారు. భాషను ఆయన కేవలం సంభాషణ సాధనంగా కాక, ఆత్మ జ్ఞానానికి వాహనంగా చూశారు. “భాష జీవమయమైన శక్తి ౧ దానిని సంరక్షించడం మన సాంస్కృతిక కర్తవ్యం” అని ఆయన ఉద్ఘాటించిన మాటలు నేటికీ ప్రాసంగికంగా నిలిచాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆయన భాషాశాస్త్ర విభాగాధి పతిగా, అనంతరం కులపతిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన పాలనలో విశ్వవిద్యాలయం విద్యా, సాంస్కృతిక రంగాల్లో పునరుజ్జీవం పొందింది. తెలుగు నిఘంటు నిర్మాణానికి, పరిశోధనా ప్రవృత్తుల పెంపుకు ఆయన అందించిన మార్గదర్శకత్వం విశేషం. ఆయన బోధనలో శిష్యులు పాండిత్యం మాత్రమే కాదు, ఆచరణాత్మక విజ్ఞానాన్ని కూడ సాధించేవారు. ఆయనను శిష్యులు “జ్ఞానతపస్వి”గా గౌరవించారు. తెలుగు భాషా శాస్త్రానికి చేసిన అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఆంధ్ర విశ్వవిద్యాలయం 1975లో ఆయనకు “కళా ప్రపూర్ణ” బిరుదు ప్రదానం చేసింది. ఆయన స్మారకార్థం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రతి సంవత్సరం “గంటి జోగి సోమయాజి స్మారకోపన్యాసం” నిర్వహించడం ఆయనకు కలిగిన గౌరవస్థాయికి ప్రతీక. 1987 జనవరి 12న ఆయన పరమపదించారు. అయితే ఆయన సృష్టించిన గ్రంథాలు, ఆయన ఆలోచనాత్మక పాఠాలు, ఆయన భాషా విశ్లేషణలు తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత స్ఫూర్తిదాయక జ్యోతులుగా నిలిచాయి. గంటి జోగి సోమయాజి శాస్త్రం, సాహిత్యం, సంస్కృతి అనే మూడు పరిమాణాలను సమపాళ్లలో మేళవించిన అరుదైన పండితుడు. ఆయన పేరు తెలుగు భాషాభిమానులకు శాశ్వత ప్రేరణ, ఆయన కృషి తెలుగు భాషా శాస్త్రానికి అమూల్య వారసత్వం.

# ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేయాలి



సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో నిరాహార దీక్ష..
18నెలలు అని ఏడేండ్లు అయినా పూర్తి కాలేదు..
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వీడాలి..
సీపీఐ(ఎం)రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జూలకంటి రంగారెడ్డి





**ఉప్పల్,అక్టోబర్06(సూర్యరేఖ)** ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డు దగ్గర సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ...18 నెలల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేస్తాం అని చెప్పి ఏడేండ్లు గడిచినా 50 శాతం మాత్రమే పనులు పూర్తి అయ్యాయి అన్నారు.కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్,8 మంది బిజెపి ఎంపీలు మల్కాజిగిరి మాజీ ఎంపీ,ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి లాంటి హేమ హేమీలు ఉన్నా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే పనుల్లో జాప్యం జరుగుతోంది ఆరోపించారు.ఉప్పల్ నుంచి ఘట్ కేసర్,వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు గుంతల మయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలి అన్నారు.లేదంటే పోరాటం ఉధృతం చేస్తాం అని హెచ్చరించారు.ఈ విషయం పై సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నుంచి ముఖ్యమంత్రి, ఆర్ అండ్ బి మంత్రికి లేఖ రాస్తాం అన్నారు. ప్రభుత్వాల చేతగాని తనం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అన్నారు.నత్త నడకన జరుగుతున్న పనులను యుద్ధ ప్రాతి పదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ...ఉప్పల్-నారపల్లి పనులపై రకరకాల ప్రకటనలు వస్తున్నాయి,తప్పితే పనులు ముందుకు సాగడం లేదు అన్నారు.దసరా వరకు పూర్తి చేస్తాం అన్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఇప్పుడు 2026 దసరా వరకు పూర్తి చేస్తాం అని చెబుతున్నారు అని, అప్పటిలోపైన పూర్తి అవుతుందా అని ప్రశ్నించారు. ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారని,స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ స్పందించి కేంద్రపై ఒత్తిడి తీసుకు రావాలి అని కోరారు.ఇక్కడ గతంలో ఎంపీగా పని చేసిన రేవంత్ రెడ్డికి ఇక్కడి ఇబ్బందులు తెలుసు అని కాస్త చొరవ తీసుకోవాలి అన్నారు.గతంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర,సంతకాల సేకరణ సైతం చేపట్టినట్టు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజల గోస పట్టదా అని ప్రశ్నించారు.మద్దతు తెలిపిన పలువురు సీపీఐ (ఎం) ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షకు బీఆర్ఎస్,సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పీర్జాదిగుడా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరంలో 36 ఫ్లైఓవర్లు నిర్మించాం అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ పడి పోయిందన్నారు.ఉప్పల్ నుంచి పీర్జాదిగుడా వెళ్ళడానికి 40 నిమిషాల సమయం పడుతుందన్నారు.నిత్యం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,త్వరగా పనులు పూర్తి చేయాలి కోరారు.ఈ విషయంపై గత సీఎం కేసీఆర్ ను సైతం కలిసి విన్నవించినట్టు గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండేండ్లు కావస్తున్నా ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులపై ఆసక్తి చూపకపోవడం సరికాదు అన్నారు. సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి సత్య ప్రసాద్ మాట్లాడుతూ... పనులను వెంటనే పూర్తి చేయాలి అన్నారు.ఈ కార్యక్రమం లో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్,సీపీఐ(ఎం)మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.చంద్రశేఖర్,కోమటి రవి,ఎం.వినోద,రాజశేఖర్, ఎం.శ్రీనివాస్,జిల్లా కమిటీ సభ్యులు సబితా రాథోడ్ సంతోష్ శంకర్,లక్మన్,ఉప్పల్ మండల కార్యదర్శి వెంకన్న మేడిపల్లి మండల నాయకులు సృజన కర్ర జంగయ్య,ఉప్పల్ సిపిఎం నాయకులు ఎండి.గౌస్, అశోక్ రెడ్డి,స్వామి ఊర్మిళ,సామల నాగరాజు,జీ. భీష్మచారి,ఉపేందర్ రాజు వెంకటేష్ పట్టాభి రామయ్య మురళీమోహన్ జంగయ్య యాదగిరి రమేష్,బీఆర్ఎస్ నాయకులు లేత ఆకుల రఘు పతి రెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సేవ్ పవర్ సేవ్ ఉప్పల్ బిజెపి డివిజన్ కమిటీ ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ కి వినతి





ఉప్పల్ బిజెపి అధ్యక్షులు మారినేని ఫణిందర్ ఆధ్వర్యంలో ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ని కలిసిన నేతలు..

**ఉప్పల్,అక్టోబర్06(సూర్యరేఖ)** ఉప్పల్ బిజెపి అధ్యక్షులు మారినేని ఫణీంద్ర ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో డివిజన్ లోని పలు సమస్యలపైన డిప్యూటీ కమిషనర్ గోధుమల రాజుతో చర్చించి వినతి పత్రం అంద జేశారు.ఈ సందర్భంగా ఫణీంద్ర మాట్లాడుతూ ముఖ్యంగా ఉప్పల్ డివిజన్లోని పలు కాలనీలో అధ్యక్షులు,విద్యుత్ వినియోగదారులు కంప్లైంట్ ఇస్తున్నారని అంటూ పట్ట పగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగుతూ దుర్వినియోగం జరుగుతుందన్నారు. సమస్య మా దృష్టికి వచ్చిన వెంటనే మేము కూడా పర్యవేక్షించడం జరిగిందన్నారు.ఈ ప్రక్రియలో భాగంగా సంబంధిత అధికారులతోటి లైన్ మెన్,ల తోటి మాట్లాడితే వారు చెప్పిన విషయమైందంటే ఆటోమేటిక్ కట్ ఆఫ్ మిషన్స్ పాడైపోయాయని అన్నారు.గత 20రోజుల నుంచి మేము డి.ఈ.కి చెప్తూనే ఉన్నా కానీ ఇప్పటిదాకా రాలేదని అన్నారు.దాదాపు150 నుంచి 200 స్తంభాల వరకు ఈ మిషన్స్ పాడైపోయాయని అన్నారు.ఈ విద్యుత్ పరంగా దుర్వినియోగం జరుగుతుందని వెంటనే దీనిపైన చర్య తీసుకొని తక్షణమే సమస్యను పరిష్కరించాలని కమిషనర్ ని కోరడం జరిగిందన్నారు.డిప్యూటీ కమిషనర్ రాజు వెంటనే స్పందించి సంబంధిత జిహెచ్ఎంసి విద్యుత్ అధికారులు డిఈ రవీంద్రగౌడ్,తో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్,నామ శ్రవణ్,బిజెపి సీనియర్ నాయకులు చోలేటి బ్రహ్మచారి మామిళ్ళ బాలరాజు,మద్దెల పద్మ, కృష్ణవేణి,వెంకట్ సాయి ముదిరాజ్,జయరాం, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పీజీ,పీహెచ్ డీ కోర్సు ల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు దాఖలు చేసే గడువు పొడిగింపు..

**రాజేంద్రనగర్,అక్టోబర్06(సూర్యరేఖ)** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2025-26 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న పీజీ (రెగ్యులర్ మరియు ప్రత్యేక కోటా),పీహెచ్ డీకోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు లు దాఖలు చేసుకునే గడువుని పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఇ.సిహెచ్ విద్యాసాగర్ ప్రకటించారు.ఆసక్తి కల అభ్యర్థులు తమ దరఖాస్తు లని ఆన్ లైన్ లో ఈ నెల 12వ తేదీ సాయంత్రం5 గంటల వరకూ దాఖలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈనెల11వ తేదీ వరకూ దరఖాస్తు రుసుము చెల్లించవచ్చని వివరించారు.అభ్యర్థుల వినతి మేరకు ఈనెల 6వ తేదీ వరకూ ఉన్న దరఖాస్తులు దాఖలు చేసుకునే గడువుని ఈ నెల 12వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రార్ వివరించారు.కోర్సులకు సంబందించిన పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్నాయని రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఇ.సిహెచ్ విద్యాసాగర్ పేర్కొన్నారు.



## కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న కావూరి వెంకటేష్.



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 06(సూర్యరేఖ)** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా తెలంగాణ జాగృతి కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ గా కావూరి వెంకటేష్ నియామక పత్రం అందుకున్నారు.ఈ సందర్భంగా కావూరి వెంకటేష్ మాట్లాడుతూ... తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సూచనల మేరకు తెలంగాణ జాగృతిని కార్వాన్ నియోజకవర్గంలో బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసిఆర్ ఆదేశాల మేరకు తోలి,మలి ఉద్యమంలో పాల్గొని తెలంగాణ సాధనలో తనవంతు పాటుపడ్డానని గత జ్ఞాపకాలను మననం చేసుకున్నారు.

## ఉప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు,సిబ్బందికి వస్తువులు అందజేత..



**ఉప్పల్,అక్టోబర్ 06(సూర్యరేఖ)** ఉప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ. భాస్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన ప్రేరణతో ఓనపకల గ్రూప్‌కి చెందిన సాకేత్ ఓనపకల, ఉప్పల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పలు అవసరమైన వస్తువులను సోమవారం పాఠశాల ప్రాంగణంలో సిబ్బంది,విద్యార్థులకు అందజేశారు.పాఠశాల విద్యార్థులు సిబ్బందికి అవసరమైన నోటిస్ బోర్డు వైట్‌బోర్డు,మూడు కూర్చొనే చెయిర్లు,వేడి,చల్లటి నీటి సరఫరా చేసే ఫ్రిజ్,నీటి క్యాన్లు పాఠశాల అలారం/బెల్ వ్యవస్థ స్కూల్ స్టేషనరీ కాలిక్యులేటర్లు డస్ట్‌బిన్లు వాలీబాల్‌లు వాలీబాల్ నెట్‌లు తదితర అవసరమైన వస్తువులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సెక్టర్ ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.విద్యాభివృద్ధి,సమాజ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ దానం విద్యార్థుల శ్రేయస్సు కోసం తీసుకున్న మంచి చర్యగా నిలిచింది.ఈ వనరులతో విద్యార్థులకు మెరుగైన పాఠశాల వాతావరణం లభించగలరని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## గుడిమల్కాపూర్ లో కానిస్టేబుల్ పై చీటింగ్ కేసు..

సహకరించిన అధికారులను విధుల నుండి తొలగించండి..




**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్06(సూర్యరేఖ)**గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్లో ఓ కానిస్టేబుల్ పై చీటింగ్ కేసు నమోదైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ప్రస్తుతం వెస్ట్ జోన్ స్పెషల్ బ్రాంచ్ లో పనిచేస్తున్న కానిస్టేబుల్ షరీఫ్ ఫైనాన్స్ లో కార్లు ఇప్పిస్తున్నాడు.బ్యాంక్ సీజ్ చేసిన కార్లు తక్కువ ధరకు ఇస్తామని పోలీస్ కానిస్టేబుల్ నమ్మించి ఫైనాన్స్ క్లియర్ కానీ రెండు కార్లను రూ.10.50 లక్షలు తీసుకొని మెహదీపట్నం దిల్షాద్ నగర్ కు చెందిన డాక్టర్ మొహమ్మద్ అబ్దుల్ ఖదీర్ ఖాన్,కు ఇప్పించాడు.కానిస్టేబుల్ షరీఫ్ ఫైనాన్స్ క్లియర్ కాకపోవడం ఎన్ఓసి ఇవ్వకపోవడంతో పలుమార్లు కానిస్టేబుల్ ను ని బాధితుడు నిలదీశాడు.కానిస్టేబుల్ షరీఫ్ నుంచి సరైన స్పందన లేకపోవడంతో గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.గుడిమల్కాపూర్ పోలీసులు.గతంలో కానిస్టేబుల్ గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్లో కూడా పనిచేశాడు.ఈ మేరకు కానిస్టేబుల్ షరీఫ్ తో పాటు,స్థానిక వ్యక్తిపై 420,406 ఆర్/డబ్ల్యూ 34 సెక్షన్,ల కింద కేసు నమోదు చేశారు.ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటు ఈ లాంటి మోసాలకు పాల్పడిన వారిని,అధికారుల ప్రోద్భలం లేకుండా వీరు ఈ పని చేసి ఉండరని ప్రజలు భవిస్తూ వారిని వెనకేసుకొచ్చి సంహరించిన అధికారులను కూడా విధుల నుండి సస్పెండ్ చెసి కఠిన శిక్షలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా





**హెచ్ బికాలనీ డివిజన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఉప్పల్,అక్టోబర్ 06(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.మీర్ పేట్ హెచ్ బికాలనీ డివిజన్ లోని పలు కాలనీలలో రూ.52 లక్షల వ్యయంతో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి,లతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని,ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తానని తెలిపారు.అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు.అనంతరం కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని, డివిజన్ అభివృద్ధి విషయంలో ఎల్లవేళలా సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీ.ఈ.రూప,వర్క్ ఇన్స్పెక్టర్ చారి నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు మల్లారెడ్డి ఇక్బాల్,అరిఫుద్దీన్, వీరభద్రరావు మల్లేష్ గౌడ్ బోదాసు రవి వెంకట్, మురళి నరసింహగౌడ్ కృష్ణ చంద్రశేఖర్ రామ కృష్ణచక్రవర్తి దాసు కిరణ్ శేఖర్ గౌడ్ శివ దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరి కాలనీవాసులు పాల్గొన్నారు.

# హుక్కా సెంటర్ పై ఎస్ఒటి పోలీసుల దాడి





**5 మంది యువకులు అరెస్ట్..**
**10 హుక్కా ఫ్లేవర్డ్ పెట్టెలు,ఫ్లేవర్ ప్యాకెట్లు,పాట్స్,5 మొబైల్ ఫోన్లను స్వాధీనం..**

**రాజేంద్రనగర్,అక్టోబర్06(సూర్యరేఖ)**నగర శివారు నిబంధనలు ఉల్లంఘిస్తున్న హుక్కా సెంటర్ పై ఎస్ఒటి పోలీసుల ఆదివారం అర్ధరాత్రి దాడులు చేశారు. ఈ ఘటన మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శాస్త్రిపురంలో నిర్వహిస్తున్న హుక్కా సెంటర్ పై దాడి నిర్వహించి 5మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు.ప్రభుత్వం నిషేధించిన హానికరమైన హుక్కా ఫ్లేవర్డ్ ఉపయోగించడంతో పాటు సమయం ముగిసిన తర్వాత చట్టవిరుద్ధంగా హుక్కా సెంటర్‌ను నడుపడంతో మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసులు నమోదు చేశారు.హుక్కా సెంటర్ యజమాని షంషీర్, ని అదుపులోకి తీసుకున్నారు.హుక్కా సెంటర్ నుంచి 10 హుక్కా ఫ్లేవర్డ్ పెట్టెలు,ఫ్లేవర్ ప్యాకెట్లు,పాట్స్,5 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వారిని మైలార్ దేవ్ పల్లి పోలీసులకు అప్పగించారు.పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం



**నారాయణపేట,అక్టోబర్06(సూర్యరేఖ)** నారాయణపేట నియోజక వర్గం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి,మాజీ డి.సి.సి.అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట పట్టణంలోని సివిఆర్ భవన్ లో మార్కెట్ కమిటీ చైర్మన్, మండల ప్రెసిడెంట్ రాంపురం శివారెడ్డి ఆధ్వర్యంలో నారాయణపేట మండల కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. జెడ్పిటిసి ఎంపీటీసీ, సర్పంచ్,వార్డు మెంబర్ల స్థానాలకు పోటీ చేయాలనుకున్న ఆశావహులు వాళ్ల పేర్లను నమోదు చేసుకున్నారు.ఈ పేర్లను పార్టీ సర్వే చేయించి తుది జాబితా విడుదల చేస్తారని శివారెడ్డి తెలిపారు.పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు పరుస్తున్న ఆరు గ్యారంటీలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట్ల రవీందర్ రెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్,టౌన్ ప్రెసిడెంట్ సలీం,మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరణప్ప,వెంకటయ్య,ఆర్టీఏ మెంబెర్ పోశాల్ రాజేష్, నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,అక్టోబర్ 06(సూర్యరేఖ)** ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు,తో కలిసి వాటర్ వర్క్ ఎండీ అశోక్ రెడ్డిని సోమవారం జలమండలి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం రామంతపూర్ లో వాటర్ వర్క్స్ కి సంబంధించి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేయించడం జరిగింది.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత గంధం నాగేశ్వర్ రావు మాట్లాడుతూ...రామంతపూర్ డివిజన్ కి రూ.2.50కోట్ల నిధులు మంజూరు చేయించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.వివేక్ నగర్ నుండి తూర్పు శ్రీనివాసపురం ప్రధాన రహదారి తూర్పు శ్రీనివాసపురం,మధుర నగర్ సబ్లైన్ల వరకు మురుగు మెయిన్ వేయడం, హబ్సిగూడ డివిజన్ మురుగు మెయిన్ నుండి వివేక్ నగర్ తూర్పు శ్రీనివాసపురం ప్రధాన రహదారి వేయడం,వివేక్ నగర్,తూర్పు శ్రీనివాసపురం ప్రధాన రహదారి,వివేక్ నగర్ నుండి తూర్పు శ్రీనివాసపురం ప్రధాన రహదారి మరియు తూర్పు శ్రీనివాసపురం మధుర నగర్ సబ్లైన్ల నుండి మురుగు మెయిన్ వేయడం,వివిధ ప్రదేశాలలో 200 ఎంఎం మురుగు లైన్ 9 మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.ఈ మురుగునీటి పనులు పూర్తయితే రామంతపూర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలకు సమస్య తప్పుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

## ఘనంగా రాంసింగ్ పురా బస్తీలో ఆర్ఎస్ఎస్ శతజయంతి ఉత్సవాలు..



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 06(సూర్యరేఖ)** గోల్కొండభాగ్,కార్వాన్ నగర్,అన్నపూర్ణ దేవాలయం మైదానం,రాంసింగ్ పురా బస్తీలో ప్రముఖ్ జొన్నకుంటి మధుసూధన్ సహకారాలతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శత జయంతి ఉత్సవాలు,విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బిఎస్ఐటి విద్యా సంస్థ చైర్మన్ బండారి వెంకటేష్,వక్తగా దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ప్రముఖ్ భాస్కర్ జీ,లు పాల్గొని భారత మాతకు,ఆర్ఎస్ఎస్ ప్రముఖుల చిత్రపటాలకు పూల మాలలు వేసి,వారి సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పరమపూజనీయడు డా.కేశవరావ్ బలీరామ్ హెడ్గేవార్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని 1925లో విజయదశమి పర్వదినాన స్థాపించారు.సమరసతతో కూడిన సంఘటిత భారతదేశ నిర్మాణంలో నిమగ్నమైన సంఘం అన్నారు,విజయదశమికి 100 సంవత్సరాల శుభ తరుణంలో ఏర్పాటు చేసిన ఉత్సవ వేడుకలన్నారు.నేడు కోట్లాది మంది స్వయం సేవకుల ద్వారా దేశంలోనే అతిపెద్ద ఎన్జీవోగా గుర్తింపు పొందతన ఈ100 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో మూడు సార్లు నిషేదం విధింపబడిన,ఎంతో మంది దేశ భక్తులను తయారు చేసి ఈ భారత మాత సేవలో నిమగ్నమైందని అన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ..




**నిజాంపేట,అక్టోబర్06(సూర్యరేఖ)**మండల కేంద్రంలో సోమవారం ఎస్ఐ రాజేష్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వాహనాదారులు తప్పకుండా రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు.డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్,ఇన్సూరెన్స్,పిట్ నెస్,కలిగి ఉండాలని అలాగే హెల్మెట్,సీట్ బెల్ట్,ధరించి వాహనాలు నడపాలన్నారు.మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్,కానిస్టేబుల్ దయానంద్, హరీష్,లు ఉన్నారు.

## నిజాంపేట జడ్పిటిసి అభ్యర్థి రేసులో.. ఆశావాహులు




**నిజాంపేట,అక్టోబర్06(సూర్యరేఖ)** మెదక్ జిల్లా,నిజాంపేట మండల జడ్పిటిసి అభ్యర్థి రేసులో ఆశావాహులు,నువ్వా నేనా అన్నట్టుగా ఉన్నారు.ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ నుండి నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన పరిపాటి అనిత సుధాకర్ రెడ్డి,కల్వకుంట నుండి అందే ఇందిరా కొండల్ రెడ్డి,నిజాంపేటకు చెందిన పప్పుల లహరి కిష్టారెడ్డి, బజార్ ప్రియాంక రంజిత్ గౌడ్,లు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ వీసీ పార్టీ తరపున నార్లపూర్ చెందిన రావిపల్లి ప్రభరాణి అమర సేనారెడ్డి,నస్కల్ కు చెందిన బక్కన్నగారి మంజుల లింగంగౌడ్, ఉన్నారు.బిజెపి పార్టీకి సంబంధించి బచ్చు రాజుపల్లికి చెందిన చిన్నమనైన వైష్ణవి శ్రీనివాస్, నస్కల్ కు చెందిన తీగల జ్యోతి శ్రీనివాస్ గౌడ్,లు నిజాంపేట మండలం జడ్పిటిసి అభ్యర్థి రేసులో ఉన్నట్లు స్థానిక సమాచారం.ప్రముఖ సంఘ సేవకులు లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్, రామాయంపేట, నుండి పోటీ చేస్తారా లేదా నిజాంపేట మండలంలో పోటీ చేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## మండలంలో భారీ వర్షం..

దామరగిద్దలో ఇండ్లలో చేరిన వర్షం నీరు..



**నాగల్ గిద్ద,అక్టోబర్ 06(సూర్యరేఖ)**నాగలిగిద్ద మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం తెల్లవారుజామున నుంచి ఉదయం 10 గంటల వరకు భారీ వర్షం కురిసింది.దీంతో పలు రహదారులు నీటి మయంగా మారడంతో పాటు వ్యవసాయ పంట పొలాల్లో వరదపు నీరు చేరాయి. కాగా మండల పరిధిలోని దామరగిద్ద గ్రామంలో రోడ్డు మీద ప్రవహించుకుంటూ వర్షం నీరు ఇంట్లో చేరాయి. దీంతో జనాలు అవస్థలకు గురయ్యారు.

## ఘనంగా జిపిఓ సుజాతను సన్మానించిన బాలాజీ సంతోష్



**అందోల్,అక్టోబర్06(సూర్యరేఖ):** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం చిమ్నాపూర్ గ్రామానికి చెందిన సిరూర్ సుజాతనగేష్,ను విఆర్ఓ నుండి పదోన్నతి పొంది సదాశివపేట మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపిఓలో పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించింది.న్యాల్కల్ మండలం గుంజటి గ్రామ పాలన అధికారిగా(జీపిఓ) నియామకం అయ్యింది.సుజాత విఆర్ఓ స్థాయి నుండి జూనియర్ అసిస్టెంట్ గా సోమవారం గుంజేటి గ్రామానికి వచ్చారు.దీంతో ఎంతో స్ఫూర్తిదాయకమని వారిని ఆదర్శంగా తీసుకొని,కష్టాలను సైతం లెక్కచేయకుండా పట్టుదలతో విజయం సాధించాలని బాలాజీ సంతోష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో సుభాష్,శివకుమార్, సందీప్,లు పాల్గొన్నారు.

## ఎస్‌జీఎఫ్ 69వ రాజేంద్రనగర్ మండల స్థాయి టోర్నమెంట్..



**రాజేంద్రనగర్,అక్టోబర్06(సూర్యరేఖ)** ఎస్‌జీఎఫ్ 69వ రాజేంద్రనగర్ మండల స్థాయి టోర్నమెంట్స్,సెలక్షన్స్ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జోనల్ ఇంచార్జి గాంగ్యనాయక్ తెలిపారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ...ఈ నెల 9న కబడ్డి,వాలీబాల్,11న ఖో-ఖో మండల స్థాయి టోర్నమెంట్స్,సెలక్షన్స్ శివరాంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉదయం 9 గంటల నుంచి జరుగుతాయని జోనల్ ఇంచార్జి గాంగ్య నాయక్ తెలిపారు.ఈ టోర్నమెంట్ ను రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్,శివరాంపల్లి ప్రిన్సిపల్ భూక్య శ్రీను నాయక్ లు ప్రారంభిస్తారన్నారు.అండర్14లో పాల్గొనాలంటే జనవరి 1,2012లోపు జన్మించి ఉండాలని,అండర్ 17 పోటీలలో పాల్గొనాలంటే జనవరి 1,2009 లోపు జన్మించి ఉండాలన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్య ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.వచ్చేటప్పుడు బోనాఫైడ్ ఆధార్ జిరాక్స్ తప్పని సరి తీసుకొని రావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీడీలు జ్యోతి బాలస్వామి రెడ్డి,వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9880499993 సంప్రదించాలన్నారు.

# తకీ బాబా దర్గా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు






**నారాయణపేట,అక్టోబర్06(సూర్యరేఖ):** నారాయణపేట జిల్లా కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్నతకీ బాబా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఖావాలి కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.స్థానిక ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం.పర్ణిక రెడ్డి,మాజీ డిసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి,ల ఆదేశాల మేరకు ఎమ్మెల్యే వ్యక్తి గత పి.ఏ చిట్టెం.మాధవ్ రెడ్డి దర్గా ఉత్సవాల్లో పాల్గొని వారి తరపున చాదర్ (గలీఫె)పూలు సమర్పించిన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా దర్గా పిఠాధిపతి సయ్యద్ గయసుద్దీన్ ఖాద్రి,కాంగ్రెస్ పార్టీ నాయకులను, ఎమ్మెల్యే పి.ఏ చిట్టెం.మాధవ్ రెడ్డి,లను ప్రత్యేకంగా పూల దండ శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎం. డి.సలీం సీనియర్ నాయకులు జి.సుధాకర్ గందే.చంద్రకాంత్ మహిముద్ ఖురేషి,సతీష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మారుతీ,రహమాన్ చాంద్ హసనుద్దీన్ హైమద్ లాటి,తదితరులు పాల్గొన్నారు.

# మిస్టర్ ఇండియా టైటిల్ విన్నర్‌ను సన్మానించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్





**రాజేంద్రనగర్,అక్టోబర్06(సూర్యరేఖ)** మిస్టర్ ఇండియా 2025 టైటిల్ విన్నర్‌గా తెలంగాణ యువకుడు రాకేష్ ఆర్నె నిలువడం సంతోషంగా ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసన సభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు.ఈ మేరకు రాకేష్ ఆర్నెను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అభినందించి సన్మానించారు.ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గ్రామీణ నేపథ్యం నుంచి జాతీయ స్థాయికి,ఇప్పుడు ప్రేరణాత్మక ప్రయాణమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన యువకుడు రాకేష్ ఆర్నె,మిస్టర్ ఇండియా 2025 టైటిల్‌ను గెలుచుకొని రాష్ట్రానికి గర్వకారణమయ్యారని తెలిపారు.ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్ ఫినాలే గోవాలోని గోల్డెన్ క్రౌన్ రిసార్ట్లో ఇటీవల ఘనంగా నిర్వహించబడిందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పోటీదారుల మధ్య రాకేష్ అద్భుత ప్రతిభతో రాణించి విజేతగా నిలిచాడన్నారు.రాకేష్ మహబూబ్‌నగర్ జిల్లా నవబ్ పేట మండలం ధర్పల్లి గ్రామానికి చెందిన రైతు కుటుంబ యువకుడని వివరించారు.తన కఠోర శ్రమ,ఫిట్‌నెస్ సాధన ,సామాజిక సేవ పట్ల ఉన్న కట్టుబాటుతో ఈ విజయాన్ని సాధించాడని ఆయన తెలిపారు.రక్షా గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రాకేష్ స్థాపించిన రక్షా గ్లోబల్ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు.34 సార్లు స్వయంగా రక్తదానం చేశారన్నారు.47 మంది బాల కార్మికుల రక్షణ,77 మంది వృద్ధులకు ఆశ్రయం అనాథలు అంధులు వికలాంగుల కోసం ఉచిత వైద్య శిబిరాలు పర్యావరణ అవగాహన కార్యక్రమాలు,ఎస్‌డీజీస్ ప్రచారం అలాగే రాకేష్ మలేషియాలో జరిగిన మోడల్ యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు పొందారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు టి.ప్రేమ్ గౌడ్,సోమ శ్రీనివాస్ ధనంజయ,కిషోర్,ఘట్టయ్య,మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# వర్షం నీటి సమస్యకు పరిష్కారం చూపాలి





మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

**శంషాబాద్,అక్టోబర్06(సూర్యరేఖ)** ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతదూరమైనా వెళ్తానని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నంబర్ 15 బిడ్జ్ కింద సర్వీస్ రోడ్డు వర్షం నీటితో ఇబ్బందిగా మారడంతో ఇరిగేషన్ అదికారులతో మాజీ మంత్రి ఫోన్లో మాట్లాడారు. రోడ్డుపై వర్షం నీళ్లు నిలిచి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇకపై ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు సానకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది రాజీపేట సంజీవ,వెంకట్ రాజిరెడ్డి,ఆదిల్ అలీ కాడమోని ప్రభాకర్,నరేందర్ తదితరులు ఉన్నారు.

## వరద నష్టం అంచనాకు కేంద్ర బృందం మెదక్ జిల్లాలో పర్యటన ఖరారు..

**ఈనెల 8వ తారీకు మెదక్ జిల్లాలో పలు మండలాల్లో పర్యటన..**
**వరద నష్టం అంచనాలను కేంద్ర బృందం సభ్యులకు సుదీర్ఘంగా వివరించనున్న జిల్లా పాలన యంత్రాంగం..**
**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్,అక్టోబర్06(సూర్యరేఖ)** వరద నష్టంపై కేంద్ర బృందం పర్యటన రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా,ఎన్నికల నియమ నిబంధనలకు లోబడి ఉంటుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టం అంచనా వేయనుందన్నారు.మెదక్ మండలం నిజాంపేట మండలం రామాయంపేట మండలం,హవేలీ ఘనపూర్ మండలం,పాపన్నపేట మండలలలో పర్యటన కొనసాగుతుందన్నారు.ఈ బృందంలో ఆర్థికశాఖ వ్యవసాయశాఖ,రోడ్లు,రహదారుల శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖ,నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారాని, కేంద్ర బృందం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అధికారులతో నేరుగా మాట్లాడనుందన్నారు.

## మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేసిన హైకోర్టు జడ్జి సురేపల్లి నంద..

**ఘన స్వాగతం పలికిన మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,ఎస్పీ శ్రీనివాసరావు..**



**మెదక్,అక్టోబర్06(సూర్యరేఖ)** మెదక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందాకి ఘనంగా స్వాగతం పలికిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ శ్రీనివాసరావు మెదక్ పర్యటనలో చర్చికి వచ్చిన హైకోర్టు జడ్జికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఎస్పీ శ్రీనివాసరావు స్వాగతం పలికారు.చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.చర్చి నిర్వాహకులు చర్చి ప్రాముఖ్యతను హైకోర్టు జడ్జికి వివరించారు. జర్జి వెంట ప్రధాన న్యాయ మూర్తి నీలిమ, శుభవల్లి, ప్రభాకర్,కలెక్టర్ రాహుల్ రాజ్,జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు,మెదక్ ఆర్డిఓ రమాదేవి,తదితరులు ఉన్నారు.

## మారుతున్న సమాజం..ఎటు పోతుందో రాజకీయం.?

**పార్టీలు మారిన వారికి తగిన గుణపాటమే ఓటర్లు.?**

**కొల్చారం,అక్టోబర్06(సూర్యరేఖ)** నాడు ఒక పార్టీ,నేడు ఒక పార్టీ అన్న చందంగా మారుతున్న కొల్చారం మండల రాజకీయ పరిస్థితులను చూసి కొల్చారం మండలం వివిధ గ్రామ ప్రజలు ఆశ్చర్యానికి గురవుతున్నారు. పెద్ద పెద్ద రాజకీయ నాయకులు పార్టీలు మారితే మా ఇండ్లలోకి వచ్చి ఎలా ఓట్లు అడుగుతారో వారికే అర్థం కావాలని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.ఓట్లేసి గెలిపించేది మేము,పార్టీలు మారేది వాళ్లు అసలు ఎవరిని పిచ్చోలు చేస్తారు.ఈ రాజకీయ నాయకులు,వచ్చే స్థానిక ఎన్నికల్లో పార్టీలు మారి నాయకులకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉందని వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మామూలు ప్రజలు పార్టీలు మారితే తప్పు అని అంటారు.కానీ పెద్ద పెద్ద రాజకీయ నాయకులు పార్టీలు మారితే వారి పరిస్థితి ఏమిటి.?పార్టీలు మారిన వారిని ఓటర్లు తగిన గుణపాఠం చెప్తామని వివిధ గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**-పార్టీలు మారిన వారికి తగిన గుణపాఠమే ఓటర్లు.?**

నిన్న మొన్నటి వరకు ఒక పార్టీలో ఉండి..వారు చెప్పిన మీటింగ్లకు తీసుకెళ్లి ఎంతో కొంత చాయో నీళ్లు తాపీ మమ్ములను వాడుకున్నారు. ఇప్పుడు పార్టీలు మారిన వారిని ఏం చేయాలి అని వివిధ గ్రామాల ప్రజలు పార్టీలు మారిన రాజకీయ నాయకులను ప్రశ్నిస్తున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో మారిన నాయకులు ప్రజలకు ఏమని మాట ఇస్తారో.. మళ్లీ పార్టీ మారము..అంటారా లేక..ఓట్లు వేసినంక గెలిచి మళ్ళీ పార్టీ మారతారా..అనే కోణంలో కొల్చారం మండలం ప్రజలు పార్టీలు మారుతున్న రాజకీయ నాయకులపై తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని అంటున్నారు.ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మొద్దు.. అర్థం కాక ప్రజలను పిచ్చోళ్ళని చేస్తున్నారని అంటున్నారు.వారికి పార్టీలు మారాలని తప్ప ప్రజల సమస్యలు వారికి పట్టవా,గ్రామాల అభివృద్ధి చేయాలని వారికి తెలియదా? ఏం ముఖం పెట్టుకొని మళ్లీ ప్రజల ముందుకు వస్తారో వేచి చూడాల్సిందే.?

## ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమం రద్దు..



**రామాయంపేట,అక్టోబర్ 06(సూర్యరేఖ)** రామాయంపేట మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మున్సిపాలిటీ పరిధిలోని మరియు మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికల నేపథ్యంలో రద్దు చేయబడిందని సోమవారం మండల తహసిల్దార్ రజనీ కుమారి తెలిపారు.అదేవిధంగా ఎవరైనా సమస్యలు ఉంటే సాధారణంగా తమ దరఖాస్తులు నేరుగా మండల తహసిల్దార్ కార్యాలయంలో ఎప్పుడైనా అధికారులకు అందజేయవచ్చని పేర్కొన్నారు.ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు విడుదల చేయాలి..

**కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన..**



**రామాయంపేట,అక్టోబర్06(సూర్యరేఖ)** రామాయంపేట మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద సోమవారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ... గత రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.వేతనాల గురించి అడిగితే విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె విమర్శించారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస వేతనం రూ.15 వేల రూపాయలు చెల్లించాల్సినప్పటికీ,కాంట్రాక్టర్ కేవలం రూ.10,500 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. అంతేకాక,రెండు నెలలుగా ఆ వేతనం కూడా ఇవ్వకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ ప్రతి నెల క్రమం తప్పకుండా జీతభత్యాలు చెల్లించాలని,లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రికి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగరకు గౌరవ డాక్టరేట్..

**మెదక్ జిల్లా సగర సంఘం నేతల ఘన సన్మానం..**





**రామాయంపేట,అక్టోబర్06 (సూర్యరేఖ)** సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగరకి గౌరవ డాక్టరేట్ లభించిన సందర్భంగా మెదక్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు సంధీల సాయిలు సగర, గ్రామ అధ్యక్షుడు శంకురీ సాయిలు సగర,సగర బంధువు జ్ఞానమొల్ల రాజు సగర,లు ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శేఖర్ సగర,సగర సమాజ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూ,రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సేవలో విశిష్ట స్థానాన్ని సంపాదించారని పేర్కొన్నారు. ఆయనకు లభించిన గౌరవ డాక్టరేట్ సగర సమాజానికి గౌరవం తెచ్చిపెట్టిందని అన్నారు. సమాజ కోసం శేఖర్ సగర చేసిన కృషి అందరికీ ఆదర్శమని,ఆయన నాయకత్వంలో సగర సంఘం మరింత బలపడుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సగర సంగం మెదక్ జిల్లా అధ్యక్షులు సందీప్ సగర,సగర సంఘం నాయకులు, సభ్యులు,బంధువులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు...



**కొల్చారం,అక్టోబర్06(సూర్యరేఖ)** నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తుక్కాపూర్ మాజీ ఉపసర్పంచ్ అయిలీ నర్సింలు ఆయిల్ అరవింద్,లు చేరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్,తుక్కాపూర్ తాజా మాజీ సర్పంచ్ మాధవి శ్రీశైలం,మాజీ ఎంపిటిసి గోవింద్ గారి శేఖర్ రెడ్డి,సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,భూమేష్,ఎన్ఎస్ యుఐ మండల ప్రెసిడెంట్ ఆయిల్ నవీన్ కుమార్,మాజీ ఉపసర్పంచ్ అంజన్న,ఆయిల్ మల్లయ్య గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిల్ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్..

**ఎమ్మెల్యే మదన్మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు.**



**కామారెడ్డి,అక్టోబర్06(సూర్యరేఖ)** ఎల్లారెడ్డి నియోజకవర్గంరామారెడ్డి మండల బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్సొసైటీ డైరెక్టర్ రాజేందర్, గిద్ద గ్రామానికి చెందిన మాజీ వార్డ్ మెంబర్స్ నర్సవ్వ, రాజవ్వ, రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు లింబ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తో పాటు 30 మంది నాయకులు బీఆర్ఎస్ పార్టీని వీడి,ఎమ్మెల్యే మదన్మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే మదన్మోహన్ నాయకత్వంలో రామారెడ్డి మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చూసి ఆకర్షితులమయ్యామని తెలిపారు.ప్రజల కోసం నిజమైన సేవ చేయడానికి కాంగ్రెస్ పార్టీలో చేరామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, రామారెడ్డి మాజీ సర్పంచ్ రంగు రవీందర్,ఏఎంసీ డైరెక్టర్ రవుఫ్,మండల ఉపాధ్యక్షులు,మండల కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ, మండల బీసీ సెల్ అధ్యక్షులు,సీనియర్ నాయకులు అరవింద్ గౌడ్,శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులు వెంటనే కేవైసీ పూర్తి చేయాలి..

**రామాయంపేట తహసిల్దార్ రజనీకుమారి**







**రామాయంపేట,అక్టోబర్ 06(సూర్యరేఖ)** రామాయంపేట మండలంలో నూతనంగా రేషన్ కార్డులు పొందిన కార్డుదారులు తక్షణమే తమ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మండల తహసిల్దార్ రజనీకుమారి సూచించారు.సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ...ఈ నెలలో కొత్తగా జారీ చేసిన రేషన్ కార్డుల సంబంధంగా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మండల పరిధిలోని రేషన్ డీలర్లకు అవసరమైన సూచనలు జారీ చేశారని తెలిపారు.ప్రతి రేషన్ కార్డుదారుని రేషన్ డీలర్లు వ్యక్తిగతంగా సంప్రదించి బియ్యం పంపిణీ చేయాల్సిందిగా సూచనలు అందాయని పేర్కొన్నారు.అయితే ఇప్పటివరకు కేవైసీ చేయించుకోని రేషన్ కార్డుదారులు తమ సంబంధిత రేషన్ షాపులను తక్షణమే సంప్రదించి,అవసరమైన పత్రాలతో కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె సూచించారు.కేవైసీ పూర్తయిన కార్డుదారులకే రేషన్ సరఫరా అందుబాటులో ఉంటుందని రజనీకుమారి స్పష్టం చేశారు.ప్రతి కార్డుదారుడు ఆలస్యం చేయకుండా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని తహసిల్దార్ విజ్ఞప్తి చేశారు.

# కోఠి నుంచి ప్రేమావతిపేట్ మీదుగా 95పి ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ

**రాజేంద్రనగర్,అక్టోబరు06(సూర్యరేఖ)**కోఠి నుంచి ప్రేమావతిపేట్ మీదుగా రాజేంద్రనగర్ లోని ఏజీ కాలేజీ వరకు గతంలో ఉన్న 95పి ఆర్టీసీ బస్సును ఈ నెల 8వ తేదీ నుంచి పునరుద్ధరించడానికి రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ క్రిష్ణారెడ్డి సన్నాహాలు చేస్తున్నారు . 2019-20 కరోనా సమయంలో వర్శిటీ గేట్లు మూసి క్యాంపస్ లోకి ఆర్టీసీ బస్సులు రాకుండ అప్పటి అధికారులు చర్యలు తీసుకున్నారు.అప్పటి నుంచి అగిపోయిన బస్సు సర్వీసుల కారణంగా ప్రేమావతిపేట్,భవానీకాలనీ ప్రజలు,వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు,ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ గా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య బాధ్యతలు తీసుకున్నాక తిరిగి వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఆర్టీసీ బస్సులను నడపాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు. అందులో బాగంగా రాజేంద్రనగర్ వ్యవసాక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.గోవర్ధన్ ప్రత్యేక చొరవ తీసుకుని రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజరు క్రిష్ణారెడ్డిని కలసి విన్నవించుకున్నారు.అదే సమయంలో ప్రేమావతిపేట్ బస్తీ ప్రజలు కూడా ఆర్టీసీ మేనేజరును కలసి బస్సు సౌకర్యం




కల్పించాలని కోరారు.స్పందించిన ఆయన ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి మొదటగా కోఠి నుంచి ప్రేమావతిపేట్ మీదుగా రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల వరకు 95పి బస్సు సర్వీసును నడపాలని నిర్ణయం తీసుకున్నారు.ఈ నెల 8వ తేదీన ఆర్టీసీ సర్వీసును ఆర్టీసీ ఉన్నతాధికారులు,వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు కలసి ప్రారంభించనున్నట్లు తెలిసింది.దీంతో ప్రేమావతిపేట్ బస్తీ వాసులు,వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు.ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దేశవ్యాప్తంగా బ్లాక్ స్థాయి అధికారుల రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాల ప్రారంభం






**నీతి అయోగ్ సహకారంతో కార్యక్రమం..**

**రాజేంద్రనగర్,అక్టోబర్06(సూర్యరేఖ)** హైదరాబాద్ లోని గ్రామీణాభివృద్ధి,పంచాయతీరాజ్ జాతీయ సంస్థ (ఎన్ఐఆర్.డీపిఆర్),నీతి ఆయోగ్ సహకారంతో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ లో భాగంగా రిఫ్రెషర్ ట్రైనింగ్ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించింది.ఈ కార్యక్రమాన్ని ఎన్ఐఆర్డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి.నరేంద్ర కుమార్ ప్రారంభించారు.నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్ కార్యక్రమ లక్ష్యాలు,దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ.. 2023లో నీతియాయోగ్ ప్రారంభించిన ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ దేశవ్యాప్తంగా అత్యంత వెనుకబడిన 500 బ్లాకులను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.ఈ కార్యక్రమం కన్వర్జెన్స్,డేటా ఆధారిత ప్రణాళిక,40 సూచికల సంతృప్తి (సాచురేషన్) విధానం ద్వారా రూపుదిద్దుకుందన్నారు.ప్రస్తుతం ప్రారంభమైన ఈ రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాలు బ్లాక్ స్థాయి అధికారుల సామర్థ్యాలను పెంచి,కీలక పనితీరు సూచికలు సాధించడాన్ని వేగవంతం చేయడమే లక్ష్యంగా ఉన్నాయన్నారు.దేశవ్యాప్తంగా ఆరోగ్యం పోషణ ప్రాథమిక మౌలిక సదుపాయాలు విద్య సామాజిక అభివృద్ధి,ఆర్థిక చేర్పు అనే ఐదు ప్రధాన రంగాలపై ఈ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించింది.ఈ శిక్షణలు దేశవ్యాప్తంగా 9 కేంద్రాల్లో అక్టోబర్ 6 నుండి నవంబర్ 20 వరకు జరుగుతాయన్నారు.మొత్తం 126 శిక్షణా బ్యాచ్లలో సుమారు 5 వేల మంది బ్లాక్ స్థాయి అధికారులు ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలోస్,బ్లాక్ ప్రముఖులు పాల్గొంటారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ లక్ష్యాలను స్థాయిమట్టంలో కార్యరూపంలోకి తీసుకురావడంలో ఫీల్డ్ అధికారుల పాత్ర కీలకమని అన్నారు.కన్వర్జెన్స్,ఇన్నోవేషన్,సూక్ష్మ స్థాయి ప్రణాళిక ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు."రియల్టైమ్ మానిటరింగ్,ఉత్తమ ఆచరణలను పునరావృతం చేయడం,స్థానిక పాలన బలపరచడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' దిశగా ముందుకు సాగాలి" అని ఆయన అన్నారు.నీతి ఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఆనంద్ శేఖర్ మాట్లాడుతూ..పాల్గొన్న అధికారుల గత విజయాలను ప్రశంసించారు. ఎన్ఐఆర్.డీపిఆర్ రూపొందించిన ఈ విస్తృత శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రశంసిస్తూ, సాచురేషన్ లక్ష్యాల సాధనకు లక్ష్యబద్ధమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్అడిషనల్ మిషన్ డైరెక్టర్ ఆనంద్,శేఖర్,డాక్టర్ ఆర్.అరుణ జయమణి అసిస్టెంట్ ప్రొఫెసర్,డాక్టర్ పి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.


# అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

**మందమర్రి,అక్టోబర్ 06(సూర్యరేఖ)** గత మూడు రోజుల క్రితం మేకలను కాసేందుకు వెళ్లి అదృశ్యమైన క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అబ్రహంనగర్ కు చెందిన పదవి విరమణ సింగరేణి కార్మికుడు వేల్పుల ఎల్లయ్య (70) మృతి చెందిన ఘటన మందమర్రి మండలంలోని సారంగపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన విధాల ప్రకారం రామక్రిష్ణాపూర్ లోని అబ్రహంనగర్ కు చెందిన మృతుడు ఈ నెల 2 వ తారీఖున మేకలను కాసేందుకు ఇంటి నుండి వెళ్ళి సాయంత్రం ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు,బంధువులు తెలిసిన ప్రదేశాల్లో వెతికి నప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ మేరకు వృద్ధుని కుమారుడు వేల్పుల కుమారస్వామి 3వ తారీఖున ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా సారంగపల్లి గ్రామానికి చెందిన గొర్ల కాపర్లు,సారంగపల్లి అడవి ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సమాచారం అందుకున్న మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి,మందమర్రి రామకృష్ణాపూర్ ఎస్ఐలు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా తప్పిపోయిన వేల్పుల ఎల్లయ్యగా గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ



ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## జాగరణ్ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి కార్తీక్ రెడ్డి



**రాజేంద్రనగర్,అక్టోబర్06(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ డివిజన్ (మారుతినగర్ కామన్)లోనీ శ్రీతుల్జా భవానిమాత ఆలయంలో నిర్వహించిన జాగరణ్ కార్యక్రమంలో నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

## బీసీలకు హైకోర్టులో 42 శాతం రిజర్వేషన తీర్పు అనుకూలంగానే వస్తుంది..

**బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్య క్షులు వెంకటేష్ యాదవ్**




**నారాయణపేట, క్టోబర్06 (సూర్యరేఖ)**స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ లను పెంచుతూ...రాష్ట్ర ప్రభుత్వం జీఓ9 తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తు మాధవరెడ్డి హైకోర్ట్ లో వేసిన పిటిషన్ తీర్పు 8 తారీకు వాయిదా ఉండగా ఈ నెల 4 తారీకున సుప్రీం కోర్ట్ లో గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్ ను సుప్రీం కోర్ట్ కొట్టి వేయడాన్ని బీసీజాగృతి సేన తరపున స్వాగతిస్తున్నామని,బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్ హర్షం వ్యక్తం చేశారు.8 తారీఖున హైకోర్టులో 42శాతం రిజర్వేషన్ లకు తీర్పు అనుకూలంగానే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎనిమిది నెలల్లో 5జీకి అప్గ్రేడ్ కానున్న బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లు



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ ఎల్) మరో ఆరు నుంచి ఎనిమిది నెలల్లో తన అన్ని 4జీ టవర్లను 5జీకి అప్గ్రేడ్ చేస్తుందని కేంద్ర టెలిక మ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కౌటిల్య ఎకనామిక్ కాన్క్లేవ్ యొక్క నాల్గవ ఎడిషన్లో మాట్లాడిన ఆయన.. గత నెల ఆఖరి వారంలో 92,500 బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లు పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన సాఫ్ట్వేర్, హార్డ్వేర్ పరికరాలతో ఏర్పాటు అయ్యాయి. సాధారణంగా విదేశీ కంపెనీల నుంచి పరికరాలను కొనుగోలు చేయడం సులభమైన మార్గం. కానీ, స్వంతంగా 4జీ పరికరాలు, టెక్నాలజీ రూపొందించడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. అయినప్పటికీ కేవలం 22 నెలల వ్యవధిలోనే బీఎస్ఎన్ఎల్ స్వంత సాఫ్ట్వేర్, స్వంత రేడియో యాక్సెస్ నెట్వర్క్(ర్యాన్)లను అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. అక్టోబర్ 1తో బీఎస్ఎన్ఎల్ 25 ఏళ్ల టెలికాం సేవలను పూర్తి చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,000 కోట్ల నిర్వహణ లాభాలను సాధించింది. ఇది గతేడాది కంటే రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. అంతేకా కుండా సబ్స్క్రైబర్ల సంఖ్య 8.7 కోట్ల నుంచి 9.1 కోట్లకు పెరిగిందని, దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 2.2 కోట్ల మందికి సేవలందిస్తోందని మంత్రి వివరించారు. రానున్న రోజుల్లో కృత్రిమ మేధస్సు(ఏఐ) ఉపయోగించడంలో ఉన్న రక్షణ, ఫైర్వాల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం డిజిటల్ కస్టమర్ల చార్టర్ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

## భారత సేవల ఎగుమతులకు ఏఐ బూస్టప్




భారతీయ సేవల ఎగుమతులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ బూస్టప్గా పనిచేస్తోందని వరల్డ్ బ్యాంక్ దక్షిణాసియా చీఫ్ ఎకనమిస్ట్ ఫ్రాంజిస్కా ఓన్సోర్జ్ అన్నారు.మొత్తం సేవల ఎగుమతుల్లో కొంత అస్థిరత ఉన్నప్పటికీ 2022లో చాట్జీపీటీ వచ్చినప్పటి నుంచి భారత కంప్యూటర్ సేవల ఎగుమతులు 30 శాతం పెరిగాయి. దీని ద్వారా ఏఐ మొత్తం దేశ సేవల ఎగుమతులు పెరిగేందుకు కీలంగా మారుతోందని భారత్ స్పష్టమైన సంకేతాలను కలిగి ఉంది. ఇప్పటికే అనేక సేవా రంగాలు పనులను ఆటోమేట్ చేయడానికి, డేటాను ప్రాసెస్ చేయడం, రిమోట్ పనులకు ఏఐని ఉపయోగిస్తున్నాయి. దీనివల్ల ఎగుమతులను మరింత సమర్థవంతంగా, పోటీతత్వంతో చేయడానికి సహాయప డుతోంది. ముఖ్యంగా ఏఐతో పాటు తయారీ రంగాలు రాబోయే సంవత్సరాల్లో భారత్కు రెండు కీలకమైన పెట్టుబడి అవకాశాలుగా మారనున్నాయని ఫ్రాంజిస్కా పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తర్వాత దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు మందగించినప్పటికీ, ఇప్పటికీ ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే వేగంగా పెరుగుతున్నాయి, కానీ నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్డీఐ) బలహీనపడటం ఆందోళన కలిగిస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. భారత్ తన మార్కెట్ యాక్సెస్ను పెంచేందుకు రానున్న రోజుల్లో వాణిజ్య అడ్డంకులను, టారిఫ్లను తగ్గించాలని కోరారు. అలాగే, భారత్లో తయారీ రంగం మునుపతి కంటే అత్యంత వేగంగా దూసుకెళ్తోంది. తక్కువ ఉత్పాదకత కలిగిన రంగాల నుంచి దేశ యువత మరింత ఉద్యోగాలను సృష్టించే అవకాశాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

# రిజర్వేషన్లు మారే చాన్స్

**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కోర్టులో బ్రేక్ పడే అవకాశం**

**8వ తేదీన కోర్టు తీర్పు..**

**అనుమతించని పక్షంలో పాత రిజర్వేషన్లే కొనసాగింపు**

**ఆశావాహుల్లో సర్వత్రా ఉత్కంఠ**




**మంచిర్యాల :** స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇటీవల ఖరారైన రిజర్వేషన్లు మారనున్నాయా.. అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాల్లో 42 శాతం బీసీలకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం.. దీన్ని సవాల్ చేస్తూ పలువురు కోర్టును ఆశ్రయించడంపై ఉత్కంఠ నెలకొన్నది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీ చేసిన తీర్మానం గవర్నర్ దగ్గరే పెండింగ్‌లో ఉండగా, ఇప్పటి వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ లోపు ప్రభుత్వమే జీవో ఇవ్వాల్సిన అవసరం ఏమిటని కోర్టు ప్రశ్నించింది. ఎన్నికలకు పది రోజులు ఆగాలని ఆదేశించింది. ఈ అంశంపై తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది. దీంతో రిజర్వేషన్ల అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కోర్టు విచారణ అనంతరం ఎన్నికలపై ప్రభుత్వం ముందుకెళ్తుందని అంతా భావించారు. కానీ, కోర్టులో కేసు ఉండగానే రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండు విడుతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, మూడు విడుతల్లో సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో 8న కోర్టు ఏం తీర్పు ఇస్తుంది.. మొన్న చేసిన రిజర్వేషన్లు ఉంటాయా మారుతాయా. అన్న ఆందోళన నెలకొన్నది.

**69 శాతానికి చేరనున్న రిజర్వేషన్లు..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్ర స్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోతో.. ఎస్సీ, ఎస్టీలకు ఇప్పటికే ఉన్న 27 శాతం కలిపితే రిజర్వేషన్లు 69 శాతం దాటిపోతున్నాయి. రా జ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదు. 2018లో అప్పుడున్న బీఆర్ఎస్ సర్కారు బీసీల రిజర్వేషన్లు పెంచే ప్రయత్నం చేసింది. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళ్లడంతో పాత రిజర్వేషన్లను అనుసరించే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో పెంచిన రిజర్వేషన్లకు కోర్టు బ్రేకులు వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. కోర్టు తీర్పును మరో తేదీకి వాయిదా వేస్తే తుది తీర్పు వచ్చే దాకా ప్రభుత్వం ఎదురుచూడక తప్పదు. ఒకవేళ కోర్టులో కేసు పెండింగ్ ఉండగానే ఎన్నికలకు వెళ్తే.. ఆ ఎన్నికలను సైతం కోర్టు రద్దు చేయొచ్చు. అంత దూరం తీసుకురావడం కంటే తుది తీర్పు వెలువడే వరకూ వేచి చూడడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రిజర్వేషన్ల పెంపు సాంకేతికంగా సాధ్యం కాదని నిపుణులు సైతం చెబుతున్నారు. దీంతో ఇటీవల ఖరా రైన రిజర్వేషన్లు మారడం తప్పనిసరిగా కనిపిస్తున్నది. అదే జరిగితే అనుకూలంగా రిజర్వేషన్లు వచ్చాయంటూ సంబురప డుతున్న ఆశావహుల ఆశలు అడియాసలు కానున్నాయి.

**వేడెక్కిన రాజకీయాలు.. ఆచీతూచి అడుగులు..**

రిజర్వేషన్ల ఖరారు.. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నేపథ్యంలో గ్రామాలు, మండల స్థాయిలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కొత్తగా ఖరారైన రిజర్వేషన్లను అనుసరించి ఆశావాహులు చాలా మంది అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి తామే అభ్యర్థులమనే ప్రచారం చేసుకుంటున్నారు. సర్పంచ్ ఎవరు, ఎంపీటీసీ ఎవరు, జడ్పీటీసీ ఎవరు అంటూ జనాల్లో చర్చ మొదలైంది. ఎవరెవరు బరిలో ఉంటున్నారు.. ఎవరు గెలిచే అవకాశాలున్నాయి. అన్న అంశాలపై జోరుగా చర్చ నడుస్తున్నది. రిజర్వేషన్లు ఖరారవడంతో ప్రతి స్థానానికి ఒక్కో పార్టీ నుంచి నలుగురైదుగురి పేర్లు వినిపిస్తున్నాయి. ఎవరికి వారు పార్టీల మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎవరి పంథాలో వారు రాజకీయం మొదలుపెట్టారు. సద్దుల బతుకమ్మ.. దసరా పండుగల్లో రాజకీయ ఉనికి చాటుకునే దిశగా వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. కాగా, ఈ రిజర్వేషన్లు ఉంటాయా.. ఉండవా అన్న దానిపై స్పష్టత లేకపోవడం ఆశావాహులకు ఇబ్బందిగా మారింది. ఓ వైపు తాము బరిలో ఉంటామనే సంకేతాలు ఇస్తూనే.. ఖర్చుల విషయంలో చాలా మంది ఆచీతూచి అడుగులు వేస్తున్నారు. దీంతో ఈ నెల 8వ తేదీన కోర్టు ఏం చెబుతుంది అన్నది కీలకంగా మారింది. కోర్టు బీసీ రిజర్వేషన్లపై అనుకూలంగా స్పందించాలని కొందరు, పాత రిజర్వేషన్లకే కొనసాగించేలా తీర్పు ఇవ్వాలని మరికొందరు కోరుకుంటున్నారు. దీంతో కోర్టు ఏం చెబుతుందో అన్న ఆసక్తి ఆశావాహుల్లో ఎక్కువైపోయింది.

**ఆ గ్రామాల్లో మార్పు అనివార్యం..**

రిజర్వేషన్ల కేటాయింపు ఎలా ఉంటుందన్నది పక్కనపెడితే ఉమ్మడి జిల్లాలో వేమనపల్లి, నెన్నెల, దస్తురాబాద్, ఖనాపూర్, తాంసి మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ప్రస్తుతం కేటాయించిన రిజర్వేషన్లు గందరగోళంగా మారాయి. అసలు ఎస్సీ జనాభా లేని గ్రామాల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించడం, బీసీలే లేని గ్రామాల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడంపై ఆయా గ్రామాల వాసులు నిరసనలు, ఆందోళనలకు చేపట్టారు. తమ గ్రామాలకు కేటాయించిన రిజర్వేషన్లు మార్చాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లు మార్చక తప్పనిపరిస్థితి నెలకొంది. కోర్టు తీర్పు అనంతరం చోటుచేసుకునే పరిణామాలకు అనుకూలంగా ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లను మార్చడం అనివార్యం కానున్నది. మొత్తం రిజర్వేషన్లు మార్చాల్సి వస్తే అప్పుడైనా తమ గ్రామాలకు న్యాయం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# అబద్దాలకు మెసాలకు కెరాఫ్ కాంగ్రెస్ పార్టీ

**అడ్డగోలు హామిలిచ్చి అమలు చేయకుండా ప్రజలను వచించింది కాంగ్రెస్ ప్రభుత్వం.**

**కాంగ్రెస్ పార్టీ బాకి కార్డును ప్రతి గడపకు తీసుకువేళ్తాం.**

**కాంగ్రెస్ మెసాలను ప్రజలకు వివరిస్తాం.**

**కాంగ్రెస్ మెసపూరిత పాలనకు విసిగిపోయునా ప్రజలు కేసీఆర్ పాలనను కోరుతున్నారు**


**మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్.**



**గోదావరిఖని :** అబద్దాలకు మె?సాలకు కెరాఫ్ కాంగ్రెస్ పార్టీ, అడ్డగోలు హామిలిచ్చి అమలు చేయకుండా ప్రజలను వచించింది రేవంత్ సర్కారని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. అదివారం స్దానిక తిలక్ డౌన్ విజయమ్మ నిలయంలో ఎర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నాయకులు కౌశిక హరి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ బాకి కార్డును వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు సమయంలో ప్రతేక్షంగా సంతకాలు చేసిన అభయహస్తం కార్డు పేరిట ప్రతి ఇంటికి అందించి నమ్మబలికి ఎన్నికల్లో గెలిచాకా హామిలను అమలు పర్చడం లేదని దినిపై స్దానిక ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చేప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో దొంగ హామిలు ఇవ్వడ అధికారం లోకి వచ్చాక మర్చిపోవడం కాంగ్రెస్కు పరి పాటిగా మారిందని మండిపడ్డారు. 420 హామిలు, ఆరు గ్యారెంటీలు ఇచ్చి, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి 22 నెలలు గడుస్తున్నా వాటి ఊసే ఎత్తడం లేదని దుయ్య బట్టారు. వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మి కులు, దివ్యాంగులకు డబుల్ పెన్షన్లు, ఆడబి డ్డల వివాహానికి తులం బంగారం, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే ఆడ పిల్లలకు సైకిళ్లు, స్కూటీలు, రైతులకు రుణమాఫీ, నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్, విద్యా భరోసా, ఉచిత కరెంట్, గ్యాస్ వంటి పథకాల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం, రూ.5 లక్షలు ఇస్తామని నమ్మించి మో సం చేశారన్నారు. రాజీవ్ యువ కిరణాల పేరుతో నాలుగుసార్లు దరఖాస్తులు తీసుకుని, ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజా ల్లోకి తీసుకెళ్లడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, పార్టీ కార కర్తలు బాకీ కార్డును గడపగడపకూ తీసుకె ప్రజలను చైతన్యం చేయాలని పిలుపుచ్చారు. కాంగ్రెస్ పార్టీ మెసాలను విసిగిపోయున ప్రజలు తిరిగి కేసీఆర్ పాలన ను కోరుకుంటున్నారని, అన్ని వర్గాల ప్రజలను మె?సం చేసిన కాంగ్రెస్ పార్టీ కి రాబోవు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. అనంతరం డివిజన్ లో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ బాకి కార్డులను అందించారు. ఈ విలేఖరుల సమావేశం లో మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు చెలకలపల్లి శ్రీనివాస్ బోడ్డు రవీందర్ బోడ్డుపల్లి శ్రీనివాస్ ఇంజపురి నవీన్ కుమార్ మేతుకు దేవరాజ్ నారాయణదాసు మారుతి నీరటి శ్రీనివాస్ మేడి సదానందం దొమ్మేటి వాసు సట్టు శ్రీనివాస్ బుర్ర వెంకటేష్ ఇరుగురాళ్ల శ్రావన్ కొడి రామకృష్ణ సారయ్య నాయక్ కోర్రీ ఓదేలు ముద్దసాని సంధ్యా రెడ్డి చింటూ కనకలక్ష్మి గుర్రం పద్మ రామరాజుతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదిన సందర్బంగా క్రికెట్ టోర్నమెంట్.

**వనపర్తి :** సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన ాఔఖీ బర్త్ డే కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలు రమేష్ టీం.వనపర్తి జిల్లా కేంద్రంలో 20వ వార్డు గాంధీనగర్ లో వనపర్తి అభివృద్ధి ప్రధాత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జన్మదిన సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి బహుమతులు ప్రధానం చేసిన వనపర్తి ఃఖీూ సోషల్ మీడియా అధ్యక్షులు మాధవరావుపల్లె సునీల్ వాల్మీకి.వనపర్తి నీ అభివృద్ధి పథంలో నడిపించిన శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్ని చెరువులను ట్యాంక్ బండ్లుగా, ఏఔజ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, ఫిషరీస్, రోడ్ల విస్తరణ, సీసీ రోడ్లు, మిషన్ భగీరథ, ఏదుల రిజర్వాయిర్, సాగునీరు కు కృషి చేశారు అని యువకులు అందరు గత మూడు రోజులుగా నిరంజన్ రెడ్డి చేసిన అభివృద్ధి నీ గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ాఔఖీ కప్ క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొని మంచిగా రాణించిన టీం సభ్యులను అభినందనలు తెలిపిన సునీల్ వాల్మీకి రాబోయే రోజుల్లో ఆట మీద ఇంకా మంచి నైపుణ్యం సాధించి జిల్లా స్థాయి లో రాణించాలి అని యువకులను ప్రోత్సహించడం జరిగింది.విన్నర్స్ టీ రమేష్ (ఇ), గంగాధర్ (లఇ), శివానందు, వంశీ, అశోక్, హర్ష, పవన్, బన్నీ, చంటి, రామ్ చరణ్, ఒమేష్.రన్నెర్స్ టీం వేణు, రాజేష్, పరమేష్, శివ, గణేష్, రామ్ ప్రసాద్, రమేష్, బబ్లు, రెహ్మాత్, శివ రిదు, మధు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి జన్మదిన సందర్భంగా టోర్నమెంట్ పాల్గొన్న సునీల్ వాల్మీకి యూత్ సభ్యులు బాలరాజు, అరుణ్, నాగరాజు, రాజు, నిర్వాహకుల బృందం



కుమార్, జనార్దన్, ఇబ్రహీం, మహేష్, నరేందర్, ఆఫ్టబ్, శివ, మాట మహేష్, సాయి సాగర్, మహేష్ డే, వెంకటేష్ పాల్గొన్నారు

## ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు

**కరీంనగర్ :** స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠ శాలలోని ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ తెలిపారు. ఇటీవల కరీంనగర్ పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం లో జిల్లా ఎస్.జి.ఎఫ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్.జి.ఎఫ్ అండర్ 17 బాలబాలికల బాక్సింగ్ చాంపియన్షిప్ పోటీలలో పారమిత పాఠశాలలో 8 వ తరగతి చదువుతున్న ఎమ్. తనుశ్రీ 54-57 కిలోల విభాగంలో పదవ తరగతి చదువుతున్న పి.సిమ్రిత రెడ్డి 75-80 కిలోల విభాగంలో, జి. సాకేత్ రెడ్డి 75-80 కిలోల విభాగంలో బంగారు పధకాలను గెలుపొంది రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనారు. రాష్ట్ర స్థాయి పాఠశాలల క్రీడా బాక్సింగ్ సమాఖ్య వారి ఆధ్వర్యంలో హన్మకొండ పట్టణంలోని జె.ఎన్ స్టేడియంలోని బాక్సింగ్ హాల్ లో అక్టోబర్ 10.11.12 తేదీలలో నిర్వ హించనున్న 69వ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డా. ఇనుగంటి ప్రసాదరావు, పాఠశాల డైరెక్టర్లు . ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు. ఎం. ప్రసాద్ , హనుమంతరావు. ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్ లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే విద్యార్థులను, బాక్సింగ్ కోచ్ ఎ. రామకృష్ణ ను అభినందించారు.

## దళిత, బిసి, ముస్లిం సమస్యల పరిష్కారం కోసం ఎంఐఎంను గెలిపించాలి

**ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి యాసర్ ఆర్ఫాత్**

**పెద్దపల్లి :** రాబోయే స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీలను కలుపుకొని పోటీ చేయబోతుం దని ఎంఐఎం పార్టీ ఆదరించి ఎక్కువ సంఖ్యలో అభ్యర్థుల ను గెలిపించాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ యాసర్ అర్ఫాత్ అన్నారు. సోమవారం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు పెద్దపల్లిలో పట్టణంలో మహమ్మద్ బేగ్ నివాసంలో పెద్దపల్లి జిల్లా స్థాయి పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాసర్ అర్సాత్, జిహెచ్ఎంసి రియాసత్ నగర్ కార్పొరేటర్ మీర్జా సలీం బేగ్ లు మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో దళిత, బిసి, ముస్లిం వార్డులు అభివృద్ధి జరగాలం టే, దళిత, ముస్లింల సమస్య లు పరిష్కారం కావాలంటే ఎంఐఎం పార్టీ అభ్యర్థులను అత్యధికంగా పంచాయితీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిప ల్ కౌన్సిల్ కు గెలిపించి పంపిస్తేనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. పెద్దపల్లిలో దళిత బిసి ముస్లిం సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని, వీటి పరిష్కారం కోసం ఎంఐఎం పార్టీనీ ఆదరించి గెలిపిస్తే, చొరవ తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా మొగల్పురా ప్రాంతంలో ఎంఐఎం పార్టీ పట్టణ శాఖ కార్యాలయాన్ని కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ జిహెచ్ఎంసి మాజీ కార్పొరేటర్ సుబహన్, ఎంఐఎం పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ అడ్వకేట్ నాయకులు ఉమేర్, కలీం, శోభి బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## బాకీ కార్డుతో ప్రభుత్వరంగు బట్టబయలు చేయండి

**కె.సి.ఆర్‌ది సంక్షేమ పాలన.కాంగ్రెస్ పార్టీది విధ్వంస పాలన.**

**వనపర్తి :** పెద్దమందడి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం ఈరోజు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. సమావేశములో మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ 10ఏండ్ల ప్రజా సంక్షేమ పాలన 2ఏండ్ల విధ్వంస పాలన చూసి ప్రజలు విసిగిపోయారని అమలు కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి పథకాలు అమలు చేయకుండా ప్రజలను హరిగోస పెడుతున్నాడని కె.సి.ఆర్ చేసిన అభివృద్ధి మనం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి మాత్రమే నేడు కనిపిస్తుందని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కాగితాలకు పరిమితం అయ్యిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన మోసాలను విస్తృతంగా ప్రచారం చేసి మన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో నాయకులు జగదీశ్వర్ రెడ్డి,రఘుపతి రెడ్డి, విజయ్ కుమార్ వేణు యాదవ్,నాగేంద్రం యాదవ్,సేనాపతి తదితరులు పాల్గొన్నారు

## పట్టపగలే వృద్ధురాలిని బురిడీ కొట్టించిన దొంగలు

**వెలిజర్లలో ఘటన**

**వెంటనే గాలింపు చేపట్టిన స్థానికులు**

**ఇద్దరు దొంగలను దొరికించుకుని దేహశుద్ధి**

**షాద్ నగర్ పోలీసులకు అప్పగింత**

**హైదరాబాద్ :** పట్టపగలే ఓ గ్రామంలో వృద్ధ మహిళలను నమ్మించి బంగారు ఆభరణాలను తళ తళ మెరిసేలా చేస్తామని చెప్పి ఆ తర్వాత బంగారు నగను కాజేసిన ఇద్దరు దొంగలను గ్రామస్తులు అత్యంత చాకచక్యంగా పట్టుకొని దేహ శుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.వెలిజెర్ల గ్రామానికి చెందిన వృద్ధ మహిళ బ్యాగరి చిన్నమ్మ ఇంటి వద్దకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు.బంగారు నగలను మెరిసేలా కడిగి ఇస్తామని చెప్పడంతో సదరు వృద్ధురాలు వారి నమ్మి వెండి కడియాలు ఇచ్చింది. వాటిని బాగా శుభ్రం చేసి మెరిసేలా చేశారు. ఆ తరువాత మెడలో ఉన్న తులంన్నర బంగారు గుండ్ల హారం కూడా మెరిసేలా చేస్తామని చెప్పడంతో వృద్ధురాలు చెన్నమ్మ నమ్మింది. అంతలోని ఇంట్లో స్టవ్ పై నీళ్ళు పోసి పసుపు వేసి అందులో నగలు వేసినట్లు నటించారు. తెల్లగా అయిందని వాటిని టిఫిన్ బాక్స్ లో పెట్టామని వృద్ధురాలికి చెప్పారు. అంతలోనే వృద్ధురాలికి మైకం వచ్చేలా చేశారు. మహిళ మత్తు నుండి కోలుకొని ఆ తరువాత స్థానికులకు తన నగ గురించి చెప్పడంతో గ్రామస్తులు అప్పటికప్పుడు అప్రమత్తమై కొత్తవారు గ్రామాల్లోకి ఎవరు వచ్చారు అని వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో టీ పాయింట్ వద్ద ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు తరసపడ్డారు వారి వద్ద తెల్లని కొన్ని పౌడర్లు ఇతర వస్తువులు కనిపించాయి. గ్రామస్తులు అనుమానంతో వారిని గ్రామపంచాయతీ వద్దకు తీసుకువచ్చి నిర్బంధించారు. ఆ తర్వాత దే శుద్ధి చేయడంతో దొంగలు ఒప్పుకొని నగ తామే కాజేసినట్లు ఒప్పుకున్నారు. నగలు తీసుకెళ్లి ఓ ప్రాంతంలో దాచి పెట్టారు. చివరకు ఆ బంగారు వస్తువులు చేజెక్కించుకున్న గ్రామస్తులు వెంటనే షాద్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగలను చిత్తశుద్ధి చేసి పోలీసులకు అప్పచెప్పారు. ఈ సంఘటనతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానికులు అప్రమత్తమై వెంటనే దొంగలను పట్టుకున్న తీరు పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం అవుతుంది. ప్రస్తుతం పోలీసులు స్థానికంగా విచారణ జరుపుతున్నారు. దొరికిన ఇద్దరు దొంగల వద్ద యువ తెల్లని పౌడర్లు ఇతర వస్తువులు కనిపించాయి వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

## పోలీసు కమిషనర్‌కు ఘనంగా వీడ్కోలు

**సిద్దిపేట :** బదిలీపై వెళుతున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం పోలీస్ అధికారులు సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సిబ్బంది గజమాలతో మరియు మెమెంటో శాలువతో పోలీస్ కమిషనర్ ను ఘనంగా సన్మానించారు. అధికారులు సిబ్బంది కమిషనర్ తో పని చేసిన 21 నెలల్లో వారి యొక్క అనుభూతిని ఆనందాన్ని వ్యక్తపరిచి పూలు చల్లుతూ వారి యొక్క అభిమానాన్ని తెలియపరిచారు. ఈ సందర్భంగా డాక్టర్ బి అనురాధ మాట్లాడుతూ. సిద్దిపేటలో పనిచేయడం ఒక గొప్ప అనుభూతి అని ఎప్పుడు కూడా మరువనని అన్నారు. అధికారులు సిబ్బంది సమిష్టిగా పనిచేసే ఎలాంటి సమస్యలు లేకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. 21 నెలల పాటు తనతో సమన్వయంతో సమిష్టిగా ఒక టీమ్ వర్క్ గా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందించారు.

# బిజినెస్


# డీమార్ట్ జోరు.. దేశవ్యాప్తంగా 432 స్టోర్లతో రిటైల్‌లో దూకుడు!

## ఎనిమిది నెలల్లో 5జీకి అప్‌గ్రేడ్ కానున్న బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లు



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) మరో ఆరు నుంచి ఎనిమిది నెలల్లో తన అన్ని 4జీ టవర్లను 5జీకి అప్‌గ్రేడ్ చేస్తుందని కేంద్ర టెలికమ్యూనికేషన్ల మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ యొక్క నాల్గవ ఎడిషన్‌లో మాట్లాడిన ఆయన.. గత నెల ఆఖరి వారంలో 92,500 బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్లు పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరికరాలతో ఏర్పాటు అయ్యాయి. సాధారణంగా విదేశీ కంపెనీల నుంచి పరికరాలను కొనుగోలు చేయడం సులభమైన మార్గం. కానీ, స్వంతంగా 4జీ పరికరాలు, టెక్నాలజీ రూపొందించడం అత్యంత క్లిష్టమైన ప్రక్రియ. అయినప్పటికీ కేవలం 22 నెలల వ్యవధిలోనే బీఎస్ఎన్ఎల్ స్వంత సాఫ్ట్‌వేర్, స్వంత రేడియో యాక్సెస్ నెట్‌వర్క్(ర్యాన్)లను అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. అక్టోబర్ 1తో బీఎస్ఎన్ఎల్ 25 ఏళ్ల టెలికాం సేవలను పూర్తి చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,000 కోట్ల నిర్వహణ లాభాలను సాధించింది. ఇది గతేడాది కంటే రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. అంతేకాకుండా సబ్‌స్క్రైబర్ల సంఖ్య 8.7 కోట్ల నుంచి 9.1 కోట్లకు పెరిగిందని, దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 2.2 కోట్ల మందికి సేవలందిస్తోందని మంత్రి వివరించారు. రానున్న రోజుల్లో కృత్రిమ మేధస్సు(ఏఐ) ఉపయోగించడంలో ఉన్న రక్షణ, ఫైర్‌వాల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం డిజిటల్ కస్టమర్ల చార్టర్‌ను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

## భారత సేవల ఎగుమతులకు ఏఐ బూస్టప్




భారతీయ సేవల ఎగుమతులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ బూస్టప్‌గా పనిచేస్తోందని వరల్డ్ బ్యాంక్ దక్షిణాసియా చీఫ్ ఎకనమిస్ట్ ఫ్రాంజిస్కా ఓన్సోర్జ్ అన్నారు.మొత్తం సేవల ఎగుమతుల్లో కొంత అస్థిరత ఉన్నప్పటికీ 2022లో చాట్‌జీపీటీ వచ్చినప్పటి నుంచి భారత కంప్యూటర్ సేవల ఎగుమతులు 30 శాతం పెరిగాయి. దీని ద్వారా ఏఐ మొత్తం దేశ సేవల ఎగుమతులు పెరిగేందుకు కీలంగా మారుతోందని భారత్ స్పష్టమైన సంకేతాలను కలిగి ఉంది. ఇప్పటికే అనేక సేవా రంగాలు పనులను ఆటోమేట్ చేయడానికి, డేటాను ప్రాసెస్ చేయడం, రిమోట్ పనులకు ఏఐని ఉపయోగిస్తున్నాయి. దీనివల్ల ఎగుమతులను మరింత సమర్థవంతంగా, పోటీతత్వంతో చేయడానికి సహాయప డుతోంది. ముఖ్యంగా ఏఐతో పాటు తయారీ రంగాలు రాబోయే సంవత్సరాల్లో భారత్‌కు రెండు కీలకమైన పెట్టుబడి అవకాశాలుగా మారనున్నాయని ఫ్రాంజిస్కా పేర్కొన్నారు. కొవిడ్ మహమ్మారి తర్వాత దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు మందగించినప్పటికీ, ఇప్పటికీ ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే వేగంగా పెరుగుతున్నాయి, కానీ నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) బలహీనపడటం ఆందోళన కలిగిస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. భారత్ తన మార్కెట్ యాక్సెస్‌ను పెంచేందుకు రానున్న రోజుల్లో వాణిజ్య అడ్డంకులను, టారిఫ్‌లను తగ్గించాలని కోరారు. అలాగే, భారత్‌లో తయారీ రంగం మునుపటి కంటే అత్యంత వేగంగా దూసుకెళ్తోంది. తక్కువ ఉత్పాదకత కలిగిన రంగాల నుంచి దేశ యువత మరింత ఉద్యోగాలను సృష్టించే అవకాశాలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

భారతదేశంలో ప్రముఖ రిటైల్ స్టోర్ల చైన్ డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్ మార్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఈ త్రైమాసికంలో సంస్థ ఆదాయం గణనీయంగా పెరిగి, రిటైల్ రంగంలో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నట్లు స్పష్టం చేసింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పోటీ ఉన్నప్పటికీ, డీమార్ట్ తన వ్యూహాత్మక విస్తరణతో అంచనాలను అందుకోగలిగింది. డీమార్ట్ కార్యకలాపాల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం ఈ త్రైమాసికంలో రూ.16,219 కోట్లుగా నమోదైంది. ఇది గత ఏడాది ఇదే సమయానికి నమోదైన రూ.14,050 కోట్లతో పోలిస్తే సుమారు 15 శాతం అధికం. ఈ బలమైన వృద్ధి, డీమార్ట్ అందిస్తున్న విలువ-ఆధారిత షాపింగ్ అనుభవం పట్ల వినియోగదారుల నుంచి ఉన్న నిరంతర ఆదరణకు నిదర్శనం. నిత్యావసర సరుకుల నుంచి సాధారణ వస్తువుల వరకు నాణ్యమైన ఉత్పత్తులను తక్కువ ధరలకు అందించడంలో డీమార్ట్ విజయం సాధించింది. విస్తరణ పరంగా కూడా అవెన్యూ సూపర్ మార్ట్స్ తన దూకుడును కొనసాగిస్తోంది. 2025 సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా డీమార్ట్ స్టోర్ల సంఖ్య 432కు చేరింది. ఈ విస్తరణలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి దక్షిణ భారత రాష్ట్రాలతో పాటు ఉత్తరాదిలోని కీలక రాష్ట్రాలపై సంస్థ దృష్టి సారించింది. ఈ క్రమబద్ధమైన భౌగోళిక విస్తరణ వ్యూహం, సంస్థ ఆదాయ వృద్ధికి ముఖ్యంగా దోహదపడింది.




కొత్తగా ప్రారంభించిన స్టోర్లు స్థానికంగా బలమైన మార్కెట్‌ను ఏర్పరుచుకోవడంలో సఫలమయ్యాయి. మొత్తంగా, డీమార్ట్ యొక్క మాతృసంస్థ అవెన్యూ సూపర్ మార్ట్స్ యొక్క ఈ తాజా ఆర్థిక నివేదిక, దేశీయ రిటైల్ మార్కెట్‌లో సంస్థ యొక్క బలమైన పనితీరును, స్థిరమైన వృద్ధి సామర్థ్యాన్ని వెల్లడిస్తోంది. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్రాలకు తమ సేవలను విస్తరించడం, వినియోగదారులకు మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడం ద్వారా సంస్థ మరింత వృద్ధిని సాధించే అవకాశం ఉంది. ఈ ప్రగతి, రాబోయే త్రైమాసికాలపై అంచనాలను మరింత పెంచింది.

# దేశ జీడీపీ వృద్ధిలో మరింత కీలకంగా మారేందుకు ఎస్‌బీఐ కృషి

దేశీయ ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దేశ వృద్ధిలో మరింత కీలకంగా మారేందుకు కృషి చేస్తోందని బ్యాంకు ఛైర్మన్ సీ ఎస్ శెట్టి చెప్పారు. దేశ స్థూల జాతీయోత్పత్తి(జీడీపీ)లో ప్రస్తుతం 20 శాతంగా ఉన్న ఎస్‌బీఐ ఆస్తుల పరిమాణాన్ని 2047 నాటికి 25 శాతానికి విస్తరించే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. తాజాగా ఎన్‌పీసీఐ ఎండీ, సీఈఓ దిలీప్ అస్బేతో జరిగిన ఓ చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌బీఐ తరచుగా భారత ఆర్థికవ్యవస్థకు గణనీయమైన సహకారాన్ని అందిస్తోంది. ఎందుకంటే బ్యాంకు డిపాజిట్లలో 33 శాతం, రుణాలలో 20 శాతం వాటా కలిగి ఉంది. గత రెండు దశాబ్దాలుగా ఎస్‌బీఐ ఆస్తుల పరిమాణం స్థిరంగా దేశ జీడీపీలో 20 శాతం ఉంది. ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యం సాధించే క్రమంలో దేశ వృద్ధికి మద్దతిచ్చేందుకు




సిద్ధంగా ఉంది. ఆస్తుల పరంగా భారత ఆర్థికవ్యవస్థలో నాలుగో వంతు వాటా ఉండే దిశగా పనిచేస్తున్నాం. అంతేకాకుండా ఆస్తుల పరిమాణంలో ప్రపంచంలో టాప్-10 బ్యాంకులలో ఒకటిగా ఎదగాలని భావిస్తున్నాం. ప్రస్తుతం టాప్-50లో ఉన్న ఏకైక భారతీయ బ్యాంకు ఎస్‌బీఐ అని సీ ఎస్ శెట్టి అన్నారు. 2024-25 నాటికి ఎస్‌బీఐ బ్యాలెన్స్ షీట్ పరిమాణం రూ. 66 లక్షల కోట్లకు పైనే ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్ సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్ లాంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై దృష్టి పెట్టాలని సీ ఎస్ శెట్టి ప్రస్తావించారు. అనేక సంవత్సరాలుగా ఎస్‌బీఐ వివిధ పరిశ్రమలకు ఫైనాన్సింగ్ చేయడమే కాకుండా, వాటి సామర్థ్యాన్ని పెంచుకోవడానికి కూడా ఎస్‌బీఐ మద్దతిస్తోంది. ఎస్‌బీఐలో అభివృద్ధి చెందుతున్న రంగాల ప్రాజెక్ట్ ఫైనాన్సింగ్ కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' అనే పరిశ్రమ సహకార లేదా సమన్వయ సంస్థను ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. ఇటువంటి అనేక కొత్త రంగాలు భారత ఆర్థిక వ్యవస్థకు దోహదపడతాయి. ఈ రంగాలకు ఆర్థిక సహాయం చేయడానికి ఎస్‌బీఐ సిద్ధంగా ఉంటుందని ఆయన వెల్లడించారు.

# పాక్‌పై రికార్డు విజయం.. ఆసీస్ దిగ్గజాన్ని అధిగమించిన టీమిండియా కెప్టెన్

మహిళల వన్డే వరల్డ్‌కప్ 2025లో భాగంగా పాకిస్తాన్‌తో నిన్న (అక్టోబర్ 5) జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 88 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి ఓ మోస్తరు స్కోర్‌కే (247) పరిమితమైనప్పటికీ.. ఆతర్వాత ఆ స్కోర్‌ను విజయవంతంగా కాపాడుకుంది. క్రాంతి గౌడ్ (10-3-20-3) అద్భుతమైన బౌలింగ్‌తో పాక్ పతనాన్ని శాశించింది. క్రాంతితో పాటు దీప్తి శర్మ (9-0-45-3), స్నేహ్ రాణా (8-0-38-2) కూడా సత్తా చాటడంతో పాక్ 43 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. పాక్ తరఫున సిద్రా అమీన్ (81) ఒంటరిపోరాటం చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. అంతకుముందు భారత ఇన్నింగ్స్ దయానా బేగ్ (10-1-69-4) ధాటికి తడబడింది. టాపార్డర్ మొత్తానికి మంచి ఆరంభాలు లభించినా, ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ స్కోర్ చేయలేకపోయారు. ఆఖర్లో రిచా ఘోష్ (20 బంతుల్లో 35 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడి టీమిండియాకు గౌరవప్రదమైన స్కోర్ అందించింది. ఈ గెలుపుతో భారత్ వన్డే ఫార్మాట్‌లో దాయాదిపై తమ రికార్డును (12-0) మరింత మెరుగుపర్చుకుంది. అలాగే వరల్డ్‌కప్ టోర్నీల్లోనూ పాక్‌పై ఆధిపత్యాన్ని (5-0) కొనసాగించింది. పహల్గాం? ఉగ్రదాడి తర్వాత భారత క్రికెట్ జట్లు పాక్‌ను వరుసగా నాలుగు ఆదివారాల్లో ఓడించాయి. దీనికి ముందు భారత పురుషుల జట్టు ఆసియా కప్‌లో పాక్‌ను వరుసగా మూడు ఆదివారాల్లో ఓడించి ఆసియా ఛాంపియన్‌గా అవతరించింది. ఇదిలా ఉంటే, నిన్నటి గెలుపుతో భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఓ




అరుదైన ఘనత సాధించింది. వన్డేల్లో ఆమె ప్లేయర్‌గా 90వ విజయాన్ని నమోదు చేసి, మహిళల వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక విజయాలు సాధించిన ప్లేయర్ల జాబితాలో ఏడో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో ఆసీస్ దిగ్గజ ప్లేయర్, ఆ జట్టు మాజీ కెప్టెన్, రెండు సార్లు వన్డే ప్రపంచకప్ విన్నర్ మెగ్ లాన్నింగ్‌ను అధిగమిం చింది. లాన్నింగ్ తన కెరీర్‌లో ప్లేయర్‌గా 89 విజయాలు సాధించగా.. హర్మన్ నిన్నటి మ్యాచ్‌తో ఆమెను దాటేసింది. ఈ జాబితాలో భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ అగ్రస్థానంలో ఉంది. మిథాలీ తన వన్డే కెరీర్‌లో 129 విజయాలు సాధించింది.

**మహిళల వన్డేల్లో అత్యధిక విజయాలు సాధించిన ప్లేయర్లు**

మిథాలీ రాజ్- 129
ఎల్లిస్ పెర్రీ- 125
అలైస్సా హీలీ- 103
బెలిండ క్లార్క్- 94
కేట్ సీవర్ బ్రంట్- 93
కేట్ ఫిజ్‌ప్యాట్రిక్- 91
హర్మన్‌ప్రీత్ కౌర్- 90
మెగ్ లాన్నింగ్- 89

## గిల్‌కు ఒకేసారి ఇన్ని బాధ్యతలా? ప్రయోగం బెడిసికొట్టొచ్చు: భారత మాజీ క్రికెటర్



ఇంటర్నెట్ డెస్క్: రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్‌ను ఇటీవల టీమ్ ఇండియా వన్డే జట్టు కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాదే టెస్టు పగ్గాలు అందుకున్న గిల్.. ఇటీవల టీ20ల్లో వైస్ కెప్టెన్ అయ్యాడు. ఇప్పుడు వన్డే బాధ్యతలూ అప్పగించారు. ఉన్నట్టుండి శుభ్‌మన్‌కు వన్డే కెప్టెన్సీ అప్పగించడాన్ని భారత మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ తప్పుబట్టాడు. ఈ క్రమంలో భారత జట్టు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, కమిటీ నిర్ణయాలపై కీలక వ్యాఖ్యలు చేశాడు. "శుభ్‌మన్‌ను వన్డే కెప్టెన్ చేస్తారనే ముందే ఊహించాను. కానీ 2027 ప్రపంచ కప్ తర్వాత ఇది జరుగుతుందనుకున్నాను. రోహిత్ శర్మ ఇప్పటికీ బాగా ఆడుతున్నాడు. ఫిట్‌నెస్ కాపాడుకున్నాడు. 2027 ప్రపంచ కప్‌లో రోహిత్ ఆడే ఛాన్స్ ఉంది. కానీ అతనిని కెప్టెన్సీ నుంచి తప్పించి గిల్‌కి అప్పగించారు. ఇక సూర్య కుమార్ యాదవ్ వైదొలిగిన తర్వాత టీ20 కెప్టెన్సీ కూడా శుభ్‌మన్‌కే ఇస్తారు. ఇలా గిల్‌కు తక్కువ సమయంలో చాలా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈ ప్రయత్నం బెడిసికొట్టే ఛాన్స్ ఉంది. గిల్‌పై అధిక భారం మోపడం సరికాదు. ఒక ఆటగాడు ఎప్పుడూ కెప్టెన్సీ కావాలని అడగడు. గిల్ కూడా ఇప్పుడే వన్డే కెప్టెన్ కావాలని కోరుకొని ఉండడు. కానీ వన్డే కెప్టెన్సీ తీసుకోవాలని అజిత్ అగార్కర్, సెలక్షన్ కమిటీ కలిసి గిల్‌పై ఒత్తిడి తెచ్చి ఉండొచ్చు" అని మహ్మద్ కైఫ్ అన్నాడు. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియా, భారత్ మధ్య మూడు వన్డేల సిరీస్ మొదలవనుంది. ఈ సిరీస్‌తోనే గిల్ వన్డే కెప్టెన్ పగ్గాలు స్వీకరిస్తాడు.

# స్పోర్ట్స్

## పాకిస్తాన్ క్రికెటర్‌కు భారీ షాకిచ్చిన ఐసీసీ




పాకిస్తాన్ మహిళా క్రికెటర్ సిద్రా ఆమిన్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి భారీ షాకిచ్చింది. భారత్‌తో మ్యాచ్ సందర్భంగా ఐసీసీ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినం దుకు గానూ ఆమెను మందలించింది. అదే విధంగా.. ఓ డీమెరిట్ పాయింట్‌ను కూడా సిద్రా ఖాతాలో జమ చేసింది. అసలేం జరిగిందంటే... ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్-2025 టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తుండగా.. పాకిస్తాన్ ఆడే మ్యాచ్‌లు మాత్రం తటస్థ వేదికైన శ్రీలంకలో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దాయాదులు భారత్- పాక్ మధ్య ఆదివారం (అక్టోబరు 5) కొలంబో వేదికగా తలపడ్డాయి.

భారత్ 247 పరుగులకు ఆలౌట్

ఆర్.ప్రేమదాస స్టేడియంలో అనుకోని విధంగా టాస్ గెలిచిన పాకిస్తాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్లు ప్రతికా రావల్ (31), స్మృతి మంధాన (23) ఫర్వాలేదనిపించగా.. వన్‌డౌన్ బ్యాటర్ హర్లీన్ డియోల్ 46 పరుగులతో రాణించింది. మిగతా వారిలో జెమీమా రోడ్రిగెస్ (32), దీప్తి శర్మ (25), రిచా ఘోష్ (35 నాటౌట్) చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. పాక్ బౌలర్లలో దయానా బేగ్ నాలుగు వికెట్లు దక్కించుకోగా.. కెప్టెన్ ఫాతిమా సనా షేక్, సైదా ఇక్బాల్ చెరో రెండు, రమీన్ షమీమ్, నష్రా సంధూ ఒక్కో వికెట్ వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు.

**బౌలర్ల విజృంభణ**

ఇక లక్ష్య ఛేదనకు దిగిన పాకిస్తాన్‌కు భారత బౌలర్లు చుక్కలు చూపించారు. ఓపెనర్లు మునీబా అలీ (2), సదాఫ్ షమాస్ (6) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వాళ్లు కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయారు.

సిద్రా ఆమిన్ హాఫ్ సెంచరీ

ఐదో నంబర్‌లో ఆడిన నటాలియా పర్వేజ్ 33 పరుగులతో ఫర్వాలేదనిపించగా.. వన్‌డౌన్ బ్యాటర్ సిద్రా ఆమిన్ ఒంటరి పోరాటం చేసింది. 106 బంతులు ఎదుర్కొని తొమ్మిది ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 81 పరుగులు చేసింది. అయితే, పాక్ ఇన్నింగ్స్ 40వ ఓవర్ ఐదో బంతికి స్నేహ్ రాణా బౌలింగ్‌లో హర్మన్‌ప్రీత్‌కు క్యాచ్ ఇవ్వడంతో సిద్రా ఇన్నింగ్స్‌కు తెరపడింది. అప్పటికే పాక్ ఓటమి దాదాపు ఖరారు కాగా.. సిద్రా తన బ్యాట్‌ను నేలకేసి కొట్టి అసహనం వ్యక్తం చేసింది. ఈ చర్యను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ.. ప్రవర్తనా నియమావళిని ఉ?ల్లంఘించినందుకు గానూ ఆమెకు శిక్ష విధించింది. ఈ మేరకు.. "ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం.. అంతర్జాతీయ మ్యాచ్‌లో క్రికెట్ పరికరాలు, దుస్తులు లేదంటే గ్రౌండ్ ఎక్విప్‌మెంట్, ఫిట్టింగ్స్ వంటి వాటికి నష్టం కలిగించేలా వ్యవహరించడం నేరం. సిద్రా ఈ నిబంధనను ఉల్లంఘించింది.



# బ్లాక్ డ్రెస్సులో జాన్వీ కపూర్ గ్లామర్ షో

ముంబై: జాన్వీ కపూర్  తన ఫ్యాషన్ లుక్స్‌తో స్టన్ చేస్తోంది. జాన్ గల్లియానో బ్లాక్ కలర్ డ్రెస్సులో జిగేల్మంది ఆ బ్యూటీ. 1986 ఫాలన్ ఏంజిల్స్ కలెక్షన్‌కు చెందిన డ్రెస్సింగ్‌ను జాన్వీ ధరించింది. ఫ్రాన్స్ ఉద్యమ కాలంతో 1986 కలెక్షన్‌కు లింకు ఉన్నది. ప్రాచీన గ్రీకు, రోమన్స్‌కు చెందిన సాధారణ స్టయిల్‌లో డ్రెస్సు ఉంటుంది. గల్లియానో డిజైన్‌లో చాలా లైటర్ ఫ్యాబ్రిక్స్ ఉంటాయి. బ్లాక్ చార్‌కోల్ షేడ్‌లో ఉన్న సీజర్ ప్లీట్ డ్రెస్సును జాన్వీ వేసుకున్నది. ఆ ఔట్‌ఫిట్‌కు స్కాలోప్ నెక్‌లైన్ ఉంది. లాంగ్ స్లీవ్స్, కర్వ్ పౌచ్ ప్యాకెట్లు కూడా ఉన్నాయి. ఇక షర్ట్‌కు కూడా క్రాసోవర్ సీజర్ కట్టింగ్‌తో డిజైన్ ఉంది. రియా కపూర్ ఈ డ్రెస్సును స్టయిల్ చేసింది. ఈ ఔట్‌ఫిట్‌కు తగినట్లు హై హీల్స్ వేసుకుంది జాన్వీ. క్లచ్ అండ్ డార్క్ సన్‌గ్లాసెస్ కూడా పెట్టుకుంది ఆ క్యూటీ.



# మాస్ ఇమేజ్ కోసం ట్రై చేస్తున్న నాగ శౌర్య

## టీజర్‌తో పెరిగిన అంచనాలు

టాలీవుడ్ యంగ్ హీరో నాగ శౌర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా టీజర్‌ను తాజాగా విడుదల చేశారు. టీజర్ నిడివి తక్కువగా ఉన్నా అందులో చూపించిన విజువల్స్, డైలాగ్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. "బ్యాడ్ బాయ్ అనుకుంటే.. స్మార్ట్ బాయ్ లా ఉన్నావ్!" అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో నాగశౌర్య ఎనర్జిటిక్ మాస్ అవతారాన్ని ప్రదర్శించాడు. ఇప్పటి వరకు నాగశౌర్య చేసిన సాఫ్ట్ బాయ్ ఇమేజ్‌కు భిన్నంగా, ఈసారి యాక్షన్ మోడ్‌లో కనిపించనున్నాడు. టీజర్‌లో సాయి కుమార్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో, పూర్ణ సీరియస్ లుక్‌తో కనిపిస్తూ కథకు బలమైన బేక్‌డ్రాప్ ఉందని సూచిస్తున్నారు. ఈ మూవీ యాక్షన్, ఎమోషన్ మిక్స్‌తో వినోదాత్మకంగా ఉండబోతోందని టీజర్ చెప్పకనే చెబుతోంది.ప్రముఖ సంగీత దర్శకుడు హారీష్ జైరాజ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. అలాగే ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు కట్స్ టీజర్ టోన్‌ను మరింత షార్ప్‌గా మలిచాయి. ఈ చిత్రానికి రామ్ దేసిన దర్శకత్వం వహిస్తున్నారు. విధి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తోంది. వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాణం జరుపుతున్న ఈ చిత్రం, ఆ బ్యానర్ నుంచి వస్తున్న తొలి సినిమా కావడం విశేషం. నాగశౌర్య ఈ సినిమా ద్వారా తన కెరీర్‌లో మరో మాస్ హిట్‌ను నమోదు చేయనున్నాడా? అనే విషయంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. టీజర్ చూస్తే మాత్రం మంచి మాస్, కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా అనిపిస్తోంది. 'బ్యాడ్ బాయ్ కార్తీక్' త్వరలో విడుదల కానుంది. మరి సినిమా ఎంత వరకు ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి. చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. యూత్ ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్ గా రూపొందిన ఈ చిత్రానికి రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

# నాలుగేళ్ల తర్వాత ఫీల్డ్‌లోకి దిగుతున్న రోషన్

టాలీవుడ్ నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా ప్రదీప్ అద్వైతం డైరెక్ట్ చేస్తున్న మూవీ 'ఛాంపియన్'  సుమారు నాలుగేళ్ల తర్వాత రోషన్ మళ్లీ వెండితెరపైకి రానున్నాడు. ఈ క్రమంలో ఛాంపియన్ విడుదల పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా  ఈ మూవీని నిర్మిస్తున్నాయి. స్పోర్ట్స్ నేపథ్యంలో ఈ సినిమాపై రోషన్ చాలా ఆశలు పెట్టుకున్నాడు. సుమారు 50కి పైగా కథలను రిజెక్ట్ చేసి ఫైనల్‌గా ఈ స్టోరీని ఆయన ఎంపిక చేసుకున్నాడు. ఆపై ఈ చిత్రాన్ని స్వప్న దత్ నిర్మిస్తుండంతో అంచనాలు బాగానే ఉన్నాయి. పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కిన ఛాంపియన్ సినిమాను క్రిస్టమస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ?ప్రకటించారు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ నెటిజన్లను కూడా మెప్పించింది. ఇందులో రోషన్ లుక్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఈ మూవీ కోసం రోషన్ మేకోవర్ చాలా కొత్తగా ఉండటంతో ఈసారి భారీ హిట్ కొడతాడని నెటిజన్లు కూడా అభిప్రాయం చెందుతున్నారు.



# 'కానిస్టేబుల్' సెన్సార్ పూర్తి.. స్పెషల్ సాంగ్ రిలీజ్



వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటించిన సినిమా 'కానిస్టేబుల్'. జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో బలగం జగదీశ్ నిర్మించారు. అక్టోబరు 10న సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ క్రమంలోనే సెన్సార్ పూర్తయింది.  సర్టిఫికెట్ వచ్చింది. ఈ చిత్రం తన కెరీర్‌కు మరో మలుపు అవుతుందని హీరో వరుణ్ సందేశ్ చెప్పుకొచ్చాడు. నిర్మాత బలగం జగదీష్ మాట్లాడుతూ.. సెన్సార్ పూర్తి కావడం, ట్రైలర్ కి వస్తున్న స్పందన చూస్తుంటే సంతోషంగా ఉంది. ఇందులోని ఓ మంచి ఐటమ్ సాంగ్‌ని దసరా సందర్భంగా విడుదల చేశాం. దానికి కూడా మంచి స్పందన రావడం ఆనందంగా ఉంది అని అన్నారు.

# 'కాంతార' దెబ్బతో వన్ ప్లస్ వన్ టికెట్ ఆఫర్ ప్రకటించిన బిగ్ సినిమా




దసరా సందర్భంగా  విడుదలైన కాంతార సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో సత్తా చాటుతుంది. ఈ క్రమంలో బాలీవుడ్ థియేటర్స్ కూడా హౌస్‌ఫుల్ అవుతున్నాయి. దీంతో  జాన్వీ కపూర్, వరుణ్ ధావన్ హిందీ సినిమా 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సరికొత్త ప్లాన్ వేసింది. కాంతారను తట్టుకునేందుకు మేకర్స్‌కు మరోదారి లేకపోవడంతో కీలక నిర్ణయం తీసుకున్నారు. కాంతారతో పోటీ తట్టుకోవడం కష్టమని భావించిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి చిత్ర యూనిట్ ఇప్పుడు వన్ ప్లస్ వన్ టికెట్ ఆఫర్ ప్రకటించింది. ఈ క్రమంలో నిర్మాతలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ ద్వారా ప్రకటించారు. ప్రేమికులకు ఈ సీజన్‌లోన గొప్ప ఆఫర్ అంటూ తెలిపారు. టిక్కెట్లు బుక్ చేసేటప్పుడు వినియోగదారులు ఆఫర్‌ను పొందడానికి %బూఖుఖ% కోడ్‌ను ఉపయోగించాలని సూచించారు. సన్నీ సంస్కారి కి తులసి కుమారి చిత్రం కూడా అక్టోబర్ 2న విడుదలైంది. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ. 30 నెట్ కలెక్షన్లు సాధించింది. కాంతార చిత్రానికి క్రేజ్ పెరగడంతో ఈ మూవీ కలెక్షన్స్‌పై ఎక్కువ ప్రభావం చూపింది. దీంతో వన్ ప్లస్ వన్ టికెట్ ఆఫర్‌ను ప్రకటించినట్లు తెలుస్తుంది.

Ediited Printed & Published Mekkonda Premraj  on behalf MPR publications and Printed  RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,